


ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఏర్పాటుచేసిన కుర్చీలను బయటకు విసిరేసిన దృశ్యం

గో బ్యాక్.. అంబుజా

సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై తీవ్ర వ్యతిరేకత

- కాలుష్య భయం....కదం తొక్కిన జనం
- ప్రజాభిప్రాయ సేకరణ భగ్నం
- వెనక్కి తగ్గిన అధికారగణం
- సాయంత్రం మమ అనిపించేందుకు యత్నం
- నాయకులు అంగీకరించకపోవడంతో వాయిదా

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

కాలుష్య భయంతో ప్రజలు కదం తొక్కారు. కొత్త పరిశ్రమ ఏర్పాటుపై కన్నెర్ర చేశారు. బతుకులు నాశనం చేయవద్దంటూ నినదించారు. అధికారుల ఏర్పాట్లను భగ్నం చేశారు. చేయగలిగిందేమీ లేక అధికారులు ఉత్త చేతులతో వెనుతిరిగారు. ఇవీ...బుధవారం అంబుజా సిమెంట్స్ ప్రజాభిప్రాయ సేకరణ సభలో చోటుచేసుకున్న పరిణామాలు.

గంగవరం పోర్టుకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో పెదగంట్యాడ వద్ద కణితి గెడ్డను ఆనుకొని అదానీ యాజమాన్యం అంబుజా సిమెంట్స్ కంపెనీ పెట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై పెదగంట్యాడ ఉక్కు నిర్వాసితుల కాలనీలోని క్రీడా మైదానంలో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఏర్పాట్లు చేశారు. దీనికి సమీపంలోని 20 గ్రామాల ప్రజలు, ఉక్కు కార్మిక సంఘ నాయకులు తరలివచ్చారు. అందరి కంటే ముందు అక్కడకు సీపీఎం నాయకులు జగ్గునాయుడు, సీఐటీయూ నాయకులు కుమార్, స్టీల్ ప్లాంటు పరిరక్షణ ... మిగతా 6వ పేజీలో


ప్రజాభిప్రాయం చేపట్టిన క్రీడా మైదానం బయట ఆందోళన చేస్తున్న స్థానికులు


వేదికను తొలగిస్తున్న ఆందోళనకారులు

ప్రజాభిప్రాయమే ఫైనల్

- యాజమాన్యం ముందు అవగాహన కల్పించాల్సింది
- గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

అంబుజా సిమెంటు పరిశ్రమ ఏర్పాటుపై ప్రజల నిర్ణయమే ఫైనల్ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టంచేశారు. పెదగంట్యాడలో బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ భగ్నం కావడంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి సమావేశాలు నిర్వహించే ముందు సంబంధిత యాజమాన్యాలు పరిసర ప్రాంతాల ప్రజలకు పెట్టబోయే పరిశ్రమపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. సిమెంటు పరిశ్రమల వల్ల కాలుష్యం ... మిగతా 6వ పేజీలో

రహదారులకు మహర్దశ

- జిల్లాలో మూడు రోడ్ల మరమ్మతులు, ఓవర్ లేయర్‌కు రూ.9.35 కోట్లు కేటాయింపు


అధ్వానంగా ఉన్న రేవిడి వెంకటాపురం రోడ్డు

- జాబితాలో విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డు, గంగవరం పోర్టు-నేషనల్ హైవే, నేషనల్ హైవే వయా రేవిడి...మజ్జిపేట రోడ్లు
- త్వరితగతిన పనులు పూర్తిచేసేలా ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలు

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న రహదారుల పునర్నిర్మాణంపై ప్రభుత్వం దృష్టిసారించింది. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే తొలుత రోడ్లపై దృష్టిసారిస్తామని గడిచిన ఎన్నికల ముందు ప్రకటించిన కూటమి... అందుకు అనుగుణంగానే చర్యలు చేపట్టింది. ఈ ఏడాది సంక్రాంతి పండగకు ప్రధాన రహదారులపై గుంతలు లేకుండా చేయాలని భావించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా నిధులు మంజూరుచేసి, మరమ్మతులు పూర్తిచేసింది. ఇప్పుడు మరోసారి ప్రభుత్వం రాష్ట్రస్థాయి రహదారులు, జిల్లా స్థాయి ప్రధాన రహదారు లపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఈ రోడ్లపై గుంతలను పూడ్చడంతోపాటు అదనపు (ఓవర్ లేయర్) లేయర్ వేసేందుకు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,104 కిలోమీటర్ల మేర పనులు చేసేందుకు వేయి కోట్ల రూపాయలను కేటాయించిన ప్రభుత్వం..విశాఖ జిల్లాలో మూడు రోడ్లకు 9.35 కోట్లు మంజూరుచేసింది. తాజాగా కేటాయించిన నిధులతో విశాఖపట్నం-భీమిలి బీచ్‌రోడ్డు (మార్లిన్ కే రెస్టారెంట్ నుంచి తగరపువలస వరకూ)లో 6.62 కిలోమీటర్ల మేర పునర్నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.2.5 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. అలాగే, గంగవరం పోర్టు నుంచి జాతీయ రహదారి వరకు 2.37 కిలోమీటర్లు రోడ్డు పనులకు రూ.3.2 కోట్లను మంజూరుచేసింది. అదేవిధంగా ... మిగతా 6వ పేజీలో

కొత్త టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్

నేడు ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశం

- రేపు పాఠశాలల కేటాయింపు... నియామక ఉత్తర్వులు
- తొలుత ఏజెన్సీలో ఖాళీల భర్తీపై విద్యా శాఖ దృష్టి

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త టీచర్లకు వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలు కేటాయించనున్నారు. ఇందుకుగాను గురువారం వెబ్ ఆప్షన్స్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నారు. బుధవారమే వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఇస్తామని తొలుత ప్రకటించారు. అయితే ఖాళీల సమాచారం అందడం ఆలస్యం కావడం తో గురువారానికి వాయిదా వేశారు. గురువారం వెబ్ ఆప్షన్స్ పూర్తయిన తరువాత శుక్రవారం పాఠశాలలు కేటాయించనున్నారు. అదేరోజు నియామక ఉత్తర్వులు అందిస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఐదుచోట్ల కొత్త టీచర్లకు ఈనెల మూడో తేదీ నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఆరోజు నుంచి సర్వీస్ ప్రారంభం అయినట్టే. కాగా ఉమ్మడి జిల్లాలో 1,134 పోస్టులకు భర్తీచేశారు. అందులో 400 పోస్టులు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఏజెన్సీ పాఠశాలల్లోనివి. ఇక మునిసిపల్ పరిధి తప్ప జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్లో భారీగా ఖాళీలు ఉన్నట్టు విద్యాశాఖ గుర్తించింది. తొలుత ఏజెన్సీలో మొత్తం ఖాళీలు భర్తీచేసిన తరువాత మైదానంపై దృష్టిసారించనున్నారు. ఎస్జీటీ కేటగిరీ వరకు చూస్తే డీఎస్సీ ద్వారా నియమితులైన టీచర్లకు పోస్టింగ్స్ ఇచ్చిన తరువాత కూడా ఖాళీలు ఉంటాయని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.


కింగ్‌కు నియామక పత్రం అందిస్తున్న వీసీ రాజశేఖర్

ఏయూ రెక్టార్‌గా ప్రొఫెసర్ పి.కింగ్ -6లో

మహిళా క్రికెట్ సందడి

ప్రపంచ కప్ టోర్నీకి తొలిసారి వేదికగా నిలుస్తున్న ఏసీఏ-వీడీసీఏ స్టేడియం

- నేడు భారత్, దక్షిణాఫ్రికా మధ్య పోరు



భారత్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్

దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీకి తొలిసారి వేదికగా నిలుస్తున్న పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. గురువారం జరగనున్న మ్యాచ్‌లో ఆతిథ్య భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై, రెండో మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై వరుస విజయాలు సాధించిన భారత జట్టు గురువారం దక్షిణాఫ్రికాతో జరగనున్న మ్యాచ్‌లో ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. ఇక తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో ఘోరంగా ఓడిన దక్షిణాఫ్రికా....రెండో మ్యాచ్‌లో అనూహ్యంగా పుంజుకుని న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించడంతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంది. ఇక్కడి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే అవకాశాలున్నాయని క్రీడా నిపుణులు చెబుతున్నారు. టాస్ కీలకంగా మారే ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌కు 250కు పైగా స్కోరు చేసే అవకాశాలు ఉన్నాయి.

మహిళ ప్రేక్షకుల కోసం ప్రత్యేక చర్యలు

మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చే మహిళా అభిమానుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేకంగా వాష్ రూమ్స్ ఏర్పాటు చేశారు. పురుషులతో నిమిత్తం లేకుండా ప్రత్యేక మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా అక్కడ తగిన భద్రత చర్యలు చేపట్టనున్నారు.

భారీ బందోబస్తు

స్టేడియం బయట, లోపల ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. అలాగే ట్రాఫిక్‌కు సంబంధించి ప్రత్యేక నిబంధనలు అమలు చేయనుంది.

ఆయుష్ .. ఆపసోపాలు!

డిస్పెన్సరీల్లో నిలిచిన వైద్య సేవలు

- ఇక్కడి వైద్యులకు పీహెచ్‌సీల్లో బాధ్యతలు
- వారం రోజులుగా రోగులకు ఇబ్బందులు
- ప్రత్యామ్నాయం చూపించని అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమ్మె ప్రభావం ఆయుష్ డిస్పెన్సరీలపై పడింది. ఆయుష్ వైద్యులకు పీహెచ్‌సీల బాధ్యతలను అప్పగించడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 30 ఆయుష్ డిస్పెన్సరీల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి.


సింహాచలంలోని ఆయుష్ హోమియో వైద్యశాల

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఆయుష్ వైద్య మందిరాల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు అల్లోపతి వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళుతుండడంతో రోగులకు ఇక్కట్లు ఎదురయ్యాయి. పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టడంతో అల్లోపతి వైద్యసేవలు పొందే రోగులకు ఇబ్బందులు ఎదురవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన ఉన్నతాధికారులు...ఆయుష్ రోగులను పట్టించుకోకపోవడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు.

సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు

సమస్యల పరిష్కారం కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు రెండు వారాలుగా విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. డిమాండ్లు నెరవేర్చేంత వరకు తగ్గేది లేదని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పీహెచ్‌సీల్లో వైద్య సేవలకు అంతరాయం లేకుండా ఆయుష్ విభాగానికి చెందిన వైద్యులను పంపాలని ఆదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఆయుష్ డిస్పెన్సరీల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లంతా ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రతిరోజూ పీహెచ్‌సీలకు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. దీంతో ఆయుష్ డిస్పెన్సరీల్లో రోగులకు సేవలు అందని పరిస్థితి నెలకొంది.

30 మందికి బాధ్యతలు..

ఉమ్మడి జిల్లాలోని ఆయుష్ డిస్పెన్సరీల్లో పనిచేస్తున్న సుమారు 30 మంది వైద్యులు ప్రస్తుతం పీహెచ్‌సీల్లో వైద్య సేవలందిస్తున్నారు. పీహెచ్‌సీ బాధ్యతలను చూస్తున్న వారిలో విశాఖ జిల్లా ... మిగతా 6వ పేజీలో

ఆస్తి పన్ను వసూళ్లు ఆశాజనకం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరునెలల్లో రూ.256.5 కోట్లు వసూలు

- గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే రూ.50.25 కోట్లు అధికం
- వచ్చే ఆరు నెలల్లో మరో రూ.274.49 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం
- ఫలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ కార్యాచరణ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధిలో రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలవుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధసంవత్సరం ముగిసేసరికి రూ.256.5 కోట్లు వసూలుకాగా, వచ్చే ఆరు నెలల్లో మరో రూ.274.49 కోట్లు వసూలుచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది రూ.50.25 కోట్లు అధికంగా వసూలు కావడం విశేషం.

జీవీఎంసీ పరిధిలో 5,98,835 అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. వీటిద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.400.32 కోట్లు ఆస్తి పన్ను, ఇప్పటివరకూ ఉన్న బకాయిల నుంచి రూ.130.67 కోట్లు మొత్తం రూ.530.99 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కమిషనర్‌గా కేతన్‌గార్గ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జీవీఎంసీకి ఆదాయం పెంచే మార్గాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. ఆస్తి పన్ను, ఖాళీస్థలాల పన్నును ఎప్పటికప్పుడు వసూలుచేయడంతోపాటు బకాయిలు కూడా రాబట్టేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావును ఆదేశించారు. అలాగే పన్ను పరిధిలోకి రాకుండా ఉండిపోయిన భవనాలు, ఖాళీ స్థలాలకు అసెస్‌మెంట్‌లు జారీచేయడం ద్వారా ఆదాయాన్ని పెంచాలని సూచించారు. కమిషనర్ ఆదేశాల మేరకు పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయినా సంస్థలు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, కార్యాలయాలకు రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ స్వయంగా వెళ్లి ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి ఉక్కు ఉద్యోగులకు మళ్లీ 12 గంటల డ్యూటీ

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు బుధవారం నుంచి ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ 12 గంటలు డ్యూటీ చేయాలని స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ఎనిమిది గంటలే డ్యూటీ కాగా అదనంగా మరో నాలుగు గంటలు పనిచేయిస్తోంది. దీనికి అదనపు వేతనం గాని, సెలవు గాని మంజూరు చేయడం లేదు. దీనిని ఉద్యోగులు నిరసిస్తున్నారు. తమకు పైనుంచి ఆదేశాలు ఇచ్చే ఉన్నతాధికారులు కూడా వారానికి రెండు రోజులు కాకుండా ప్రతిరోజూ 12 గంటలు పనిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు జగన్ రాక

- రోడ్డు మార్గంలో ప్రయాణానికి షరతులతో కూడిన అనుమతి ఇచ్చిన పోలీసులు
- ఉల్లంఘిస్తే అనుమతి రద్దు చేస్తామని ప్రకటన
- అయినా భారీగా జనసమీకరణకు వైసీపీ నేతల యత్నం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం నగరానికి రానున్నారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలను ఆయన సందర్శించనున్నారు. ఇందుకోసం ఆయన విజయవాడ నుంచి విమానంలో గురువారం ఉదయం తొమ్మిది గంటలకు బయలుదేరి విశాఖ చేరుకుంటారని పార్టీ నేతలు చెబుతున్నారు. ... మెయిన్‌లో

కమనీయం...అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

సుందరీకరణ పనులు ప్రారంభం



ఫుట్‌పాత్‌కు అతికిస్తున్న టైల్స్

సింహాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వచ్చే నెలలో జరగనున్న ఐఎఫ్‌ఆర్ సదస్సు పురస్కరించుకుని బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్‌ను జీవీఎంసీ నిధులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందుకు రూ. 10 కోట్లు కేటాయించారు. సదస్సుకు హాజరయ్యే దేశ, విదేశీ ప్రతినిధులు అప్పన్నస్వామిని దర్శించుకునే అవకాశం ఉండడంతో పాతగోశాల కూడలి నుంచి పాత అడివివరం కూడలి వరకు సుందరీకరణ పనులు చేపడుతున్నారు. బుధవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లకు టైల్స్ అద్దారు.ఈ పనులు పూర్తయిన తరువాత డివైడర్ల మధ్యలో మొక్కలు నాటడం,లైటింగ్ వంటి పనులు చేపట్టనున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ నరసింహం ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

గీతంలో మూట్‌కోర్టు పోటీలు

సాగర్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీతం వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ ఎంవీవీఎస్‌మూర్తి పేరుతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మూట్‌కోర్టు పోటీలు బుధవారం గీతం వర్సిటీలో ప్రారంభమయ్యాయి. గీతం స్కూల్ ఆఫ్ లా మూట్, అడ్వకసీ కమిటీ ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను అసోం జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో మార్పులు, సమకాలీన సాంకేతిక పరిజ్ఞానం, విలువలు, రాజ్యాంగం పట్ల పూర్తి అవగాహనతో విద్యార్థులు వృత్తిలో ఎదగాలని సూచించారు. మూట్ కోర్టుల ద్వారా విద్యార్థుల్లో వృత్తినైపుణ్యాలు, లోతైన అవగాహన, వాదన పటిమ మెరుగుపడతాయని తెలిపారు. పోటీల్లోని దేశంలోని పలు యూనివర్సిటీల నుంచి దాదాపు 40 మంది విద్యార్థులు పాల్గొనున్నట్టు గీతం న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. రవీంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో గీతం న్యాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మణరావు, సహాయ ప్రొఫెసర్లు ఆశిష్‌కుమార్, లక్ష్మీ జగన్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సత్యం మాస్టారు ఎనలేని కృషి

భీమునిపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాపుల దిబ్బడిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వంకల సత్యం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతని కుటుంబానికి యూటీఎఫ్ నాయకులు బుధవారం రూ. 1.10 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్. రాయవరంలో పని చేస్తున్న సత్యం మాస్టారు ఎలమంచిలి వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మృతి చెందారని తెలిపారు. విద్యాభివృద్ధికి ఆయన ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గొట్టిపల్లి సత్యనారాయణ, ఊడికల రాంబాబు, ఎల్‌పి శ్రీనివాసరావు, ఎ. శ్రీనివాసరావు, ఆదయ్య, కోటేశ్వరరావు, జె. బాలరాజు పాల్గొన్నారు.

'జగన్ పర్యటన విజయవంతం చేయండి'

ఎండాడ, అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిరసనలో భాగంగా నర్సీపట్నం వస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటనను వైసీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఎండాడలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటలకు జగన్‌కు వేపగుంటలో పార్టీ శ్రేణులు స్వాగతం పలకాలని సూచించారు.

నగరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా సూర్యప్రకాశరావు ప్రమాణ స్వీకారం

మధురవాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నాగోతి సూర్యప్రకాశరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సూర్యప్రకాశరావును భీమిలి నియోజకవర్గం టీడీపీ నేత గంటా రవితేజ, తదితరులు అభినందించారు.

ఆయుష్...ఆపసోపాలు!

... 5వ పేజీ తరువాయి

రేవిడి, ఆనందపురం, శొంఠ్యాం, భీమునిపట్నం, మధురవాడ, అడవివరం, సింహాచలం, వేపగుంట, మింది, అగనంపూడి, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, గంపరాయి, దుంబ్రిగుడ, సీలేరు, తాజంగి, అనకాపల్లి జిల్లా సబ్బవరం, తురకలపూడి, రేగుపాలెం, సర్వసిద్ధి, కేజేపురం, వేంపాడు, నర్సీపట్నం, ఎం.కోడూరు, ఎలమంచిలి డిస్పెన్సరీల మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు. ఆయా ఆయుష్ డిస్పెన్సరీలకు వెళ్లే రోగులకు వైద్యులు లేరని సిబ్బంది చెబుతున్నారు. కొన్నిచోట్ల సిబ్బంది లేకపోవడంతో మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టిసారించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ఆస్తి పన్ను వసూళ్లు ఆశాజనకం

... 5వ పేజీ తరువాయి

సంప్రతింపులు ప్రారంభించారు. దీనివల్ల గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలి ఆరు నెలల్లోనే రూ.29.25 కోట్ల వరకూ బకాయిలు వసూలయ్యాయి. మరోవైపు పన్ను వసూళ్లలో పురోగతిపై కమిషనర్ కేతన్ గార్గ్ ప్రతి బుధవారం రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్నారు. జోన్‌ల వారీగా లక్ష్యాలు నిర్దేశించి, వాటిని ఏ మేరకు చేరుకున్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. దీంతో రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది పన్ను వసూళ్ల కోసం క్షేత్రస్థాయికి వెళ్లడం ప్రారంభించారు. దీంతో ఈ ఏడాది తొలి అర్ధసంవత్సరంలో బకాయిలతో కలుపుకుంటే రూ.256.5 కోట్లు వసూలయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధసంవత్సరం ముగిసేసరికి రూ.206.25 కోట్లు మాత్రమే వసూలు కాగా, ఈ ఏడాది రూ.50.25 కోట్లు అధికంగా వసూలైంది. మిగిలిన ఆరు నెలల్లో బకాయిలు రూ.101.42 కోట్లు, రెగ్యులర్ పన్నులు ద్వారా రూ.173.07 కోట్లు మొత్తం మరో రూ.274 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగాపెట్టుకున్నారు. కమిషనర్ రూపొందించిన కార్యాచరణను పక్కాగా అమలుచేయడం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్న రూ.530.99 కోట్లు వసూలు చేస్తామని డీసీఆర్ శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తంచేశారు.

ప్రతిపాదనలు దాటని మూలకుద్దు వంతెన

- సర్వే చేపట్టి వదిలేసిన అధికారులు
- ఏడేళ్లుగా సాకారం కాని కల
- కూటమి ప్రభుత్వంపైనే స్థానికుల ఆశలు



గోస్తనీ నదిపై వంతెన నిర్మించడానికి గుర్తించిన ప్రాంతం

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ రోడ్డు నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు నేరుగా చేరుకోవడానికి మూలకుద్దు వద్ద గోస్తనీ నదిపై వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. స్థలాన్ని పరిశీలించి, సర్వే మాత్రమే చేపట్టారు. విశాఖ నుంచి బీచ్ రోడ్డు మీదుగా భీమిలి వచ్చి అక్కడి నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు వెళ్లడానికి నిర్మించే రహదారి కోసం ముందు ఉప్పుటేరు మీదుగా వంతెన నిర్మించాలని, దాని ద్వారా దివీస్ వద్ద రోడ్డు కలుస్తుందని తొలుత ప్రతిపాదన చేశారు. ఆ తర్వాత బీచ్ రోడ్డు నుంచి నేరెళ్లవలస మీదుగా రెండు కొండల మధ్య చిన్న రోడ్డు విస్తరించి దాన్ని భీమిలి రహదారికి కలపాలని భావించారు. ఈ రెండు ప్రతిపాదనలకు గోస్తనీ నది దాటాల్సి ఉంది. అలాగే తగరపువలస వరకు వెళ్లకుండా భీమిలి తీరం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మూలకుద్దు వద్ద నదిపై వంతెన నిర్మించాలన్న ప్రతిపాదనలు కూడా తయారు చేశారు. కానీ ఇవేవీ కార్యరూపం దాల్చడం లేదు. ఏడేళ్ల నుంచి ప్రతిపాదనల స్థాయిలోనే ఉండిపోయాయి.తగరపువలసలో నదిపై వంతెన ఉంది. మూలకుద్దు వద్ద కూడా వంతెన నిర్మిస్తే చిప్పాడ, అన్నవరం, నాగమయ్యపాలెం. అమనాం గ్రామాలకు భీమిలి నుంచి దగ్గర దారి ఏర్పడుతుంది. భోగాపురం ఎయిర్ పోర్టుకు కూడా భీమిలి నుంచి నేరుగా వెళ్లడానికి అవకాశం కలుగుతుంది. నది అడ్డంగా ఉండడం వల్ల వాహనాలన్నీ ప్రస్తుతం చుట్టూ తిరిగి తగరపువలస దాటి అవంతి కళాశాల మీదుగా వెళుతున్నాయి. అయిదేళ్ల క్రితం వంతెన నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. వైసీపీ అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం వచ్చినప్పటికీ ఎటువంటి ముందడుగు పడలేదు. మూలకుద్దు ప్రాంతంలో నది నీరు తక్కువగా ఉండడం వంతెన నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని, ఇక్కడ వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

శ్మశాన వాటిక స్థలం చదును

- సాగర్‌నగర్ తీరంలో స్థానికుల ఆందోళన
- అధికారులకు ఫిర్యాదు



సాగర్‌నగర్ బీచ్‌లో చదును చేసిన స్థలం

సాగర్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవానిపాలెం శ్మశానవాటికలో భారీ ఎత్తున మట్టి డంపింగ్ చేసి స్థలాన్ని చదును చేయడాన్ని వ్యతిరేకిస్తూ వన సంరక్షణ సమితి, సాగర్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు సాగర్‌నగర్ సముద్ర తీరంలో బుధవారం ఆందోళన చేపట్టారు. కొందరు వ్యక్తులు తీరంలో రాత్రికి రాత్రి సుమారు 200 లారీల మట్టిని డంప్ చేసి స్థలాన్ని చదును చేశారు. ఈ సందర్భంగా వన సంరక్షణ సమితి, సాగర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ సాగర్‌నగర్ బీచ్‌కు ఆనుకుని గుడ్లవానిపాలెం తీరంలో తరతరాలుగా శ్మశాన వాటిక ఉందన్నారు. కొందరు రాత్రికి రాత్రి 200 లారీలతో మట్టి డంప్ చేసి, జేసీబీలతో స్థలాన్ని చదును చేశారని తెలిపారు. శ్మశాన వాటికకు పది అడుగుల ఎత్తున మట్టి వేశారని చెప్పారు. అటవీ శాఖ చట్టాలు, సీఆర్‌జెడ్ నిబంధనలను తుంగలో తొక్కి తీరాన్ని మట్టితో కప్పివేయడం దారుణమన్నారు. అధికారులు తక్షణమే స్పందించి డంప్ చేసిన మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే శ్మశాన వాటిక చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అటవీ శాఖ సెక్షన్ అధికారి చిట్టిబాబుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా ఈ విషయమై జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మిని వివరణ కోరగా పరిశీలించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన వెంకన్న తిరు పవిత్రోత్సవాలు



స్వామివారికి అన్నకూటోత్సవం

భీమునిపట్నం,అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీ నుంచి జరుగుతున్న చతుర్థ తిరు పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఉద యం కుబేర హవనం, ఐశ్వర్య లక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, స్వామివారికి, పరివార దేవతలకు, దివ్య పవిత్ర సమర్పణ, తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు పురాణం శేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్వామివారికి అన్నకూటోత్సవం, శాంతి కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్ర మూర్తి, సూర్యనారాయణమూర్తి, వుశిరికల తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో కుండపోత వర్షం



నీట మునిగిన మధురవాడ రోజువారీ మార్కెట్

మధురవాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలో బుధవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. మధురవాడలోని రోజువారీ మార్కెట్ నీట మునగడంతో వ్యాపారులు నష్టపోయారు.పండ్లు, పూలు నీటిలో కొట్టుకుపోయాయి. పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో నీరు చేరడంతో ఆస్పత్రి సిబ్బంది, రోగులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. అలాగే ఎత్తు వంతెన వద్ద మోకాలు లోతులో నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. స్వతంత్రనగర్ కాలనీ, పోర్టు కాలనీ, టైలర్స్ కాలనీల్లోనూ వర్షం నీరు ప్రవహించింది.

కాలువల్లో పేరుకుపోయిన మురుగు



గంధవరంలో కాలువలో పూడిక

పద్మనాభం రూరల్,అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంధవరం ఎస్‌సీ కాలనీ, అయినాడ, పాండ్రంగి, మునివానిపాలెం, ఏనుగులపాలెం, రౌతులపాలెం గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కాలువలు పూడికలతో నిండిపోయాయి. వీధుల్లో చెత్త పేరుకుపోయింది. కొన్ని వీధుల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో స్థానికులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. దోమల వ్యాప్తి వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో నెలలు తరబడి పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పారిశుధ్యం పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

- మండల, జోనల్ అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వసతిగృహాలు, పాఠశాలల్లో పారిశుధ్యం లోపించకుండా అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల పాఠశాల వసతిగృహంలో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా మండల, జోనల్ అధికారులు వసతిగృహాలు, పాఠశాలలను పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీటి పైప్‌లైన్ లీకులు లేకుండా చూడాలని, మరుగుదొడ్లు, సెప్టిక్‌ట్యాంక్‌ల నుంచి అనుసంధానమయ్యే పైపులను పరిశీలించి, లోపాలు ఉంటే సరిచేసి, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, డెంగ్యూ, ఇతర కాలానుగుణ వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలని కలెక్టర్ సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల పరిధిలోని వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షించాలని నిర్దేశించారు. అన్ని విద్యా సంస్థలలో తాజా పరిస్థితులను పరిశీలించి తనకు నివేదిక పంపాలని ఆదేశించారు.

చంద్రంపాలెం పాఠశాలను సందర్శించిన ఫుడ్ కమిటీ

కొమ్మాది, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏపీ ఫుడ్ కమిటీ సభ్యుడు బి. కాంతారావు బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థుల సంఖ్య, భోజనం తింటున్న వారి సంఖ్య తదితర వివరాలను హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు పలువురు అధికారులు, విద్యా కమిటీ చైర్మన్ అచ్యుతరావు ఉన్నారు.


రెడ్డిపల్లిలో భూముల రీసర్వే

పద్మనాభం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో భూముల రీసర్వే బుధవారం ప్రారంభమైంది. సర్వే సిబ్బంది, రెవెన్యూ అధికారులు 516, 517 సర్వే నెంబర్లలో ఉన్న జిరాయితీ భూములను రీసర్వే చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, వీఆర్‌ఓ వీర్రాజు, సర్వేయరు పీఎస్‌ఆర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థిక సాయం

భీమునిపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఆర్థిక బాధపడుతున్న సెలూన్ నిర్వాహకుడు ఏనుగుతల రమణ గాంధీకి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) సభ్యులు బుధవారం రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. నిరుపేద అయిన ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో మంచానికి పరిమితి కావడంతో ఫ్యాబ్ ఈ సహాయాన్ని అందించింది.


మద్దిలపేటలో 'పొలంబడి'



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాధికారులు

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి సాగులో శాస్త్రీయ పద్ధతులు తెలుసుకోవాలని ఏఓ శివకోమలి సూచించారు. బుధవారం మద్దిలపేటలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులు, ఎరువులు, పురుగు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు.అలాగే సస్యరక్షణ చర్యలు, తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించడం, ఆరోగ్యకరమైన పంటల సాగు తదితర వాటిపై వివరించారు. అనంతరం రైతులకు కిట్లు, పర్యవేక్షణ పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి స్వాతి, వీపీఏ ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టీ తగ్గింపుపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, స్థానిక నాయకులు

భీమునిపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీఎస్‌టీలో కొన్ని వస్తువులకు మినహాయింపు వల్ల సామాన్యులకు మేలు జరుగుతుందని జీఎస్‌టీ భీమిలి మండల నోడల్ అధికారి వర్మ అన్నారు. బుధవారం భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపర్ జీఎస్‌టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కేంద్రంలో ఎన్డీఏ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామ్ ప్రసాద్, ఎంపీడీఓ నరసింహారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు కె. సూరిబాబు, సాయి పాల్గొన్నారు.

పంచాయతీల పాలనపై వర్క్‌షాపు

పద్మనాభం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ పురోగతి సూచిక-1.0పై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. స్థానికీకరించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో గ్రామాభివృద్ధికి బాటలు వేసే విధానంపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. లైన్ డిపార్టుమెంట్లు తమ శాఖలకు సంబంధించిన లక్ష్యాల సూచికలను పంచాయతీ పురోగతి సూచిక వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని శిక్షకులు చెప్పారు. గ్రామాభివృద్ధిని అంచనా వేయడానికి సూచికలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రూపేష్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- అధికారులతో సమావేశం

మహారాణిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో సచివాలయాల సిబ్బంది సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని, వారి పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సమయ పాలన పాటించని సిబ్బందికి నోటీసులివ్వాలని జోనల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. ఎవరైనా మాట వినని పక్షంలో తనకు నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు. సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్, పీఎం సూర్యఘర్, పీ-4 మ్యాపింగ్, మార్గదర్శుల రిజిస్ట్రేషన్ స్టేటస్, తల్లికి వందనం, రైస్ కార్డుల పంపిణీ, ఆధార్ సీడింగ్, ఈకేవైసీ, సచివాలయ సిబ్బంది పనితీరు తదితర అంశాలపై బుధవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెబెక్స్ ద్వారా సమీక్షించారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా ప్రజలకు చేకూరు తున్న లబ్ధి, ఇతర ప్రయోజనాలపై క్షేత్రస్థా యిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని చాంపియన్ల సహకారంతో సూపర్ జీఎస్టీ సేవింగ్స్ పై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రత్యేకంగా ప్రచారం చేయాలని కోరారు. డీఆర్‌డీఏ, యూసీడీలోని మహిళల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ధరలలో వ్యత్యాసాలను విడమ రిచి చెప్పాలని సూచించారు. పీ4లో బాగంగా మార్గదర్శులను బంగారు కుటుంబాలకు అనుసంధానం చేసి కార్యాచరణ మొదలు పెట్టాలని, ఎన్‌ఆర్‌ఐల సహకారం కూడా తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు యోగా జట్టు ఎంపిక పోటీలు

తగరపువలస, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విజయనగరంలోని జేఎన్‌టీయూ పరిధిలో ఉన్న అన్ని ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన బాలికల యోగా జట్టు ఎంపిక పోటీలు గురు వారం తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో జరగనున్నట్టు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

గో బ్యాక్...అంబుజా

... 5వ పేజీ తరువాయి

కమిటీ కన్వీనర్ అయోధ్యరామ్, తదితరులు చేరుకుని ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారిని హార్బర్ ఏసీపీ కాళిదాసు గేటు వద్దనే కొద్దిసేపు ఆపేశారు. ఆందోళన చేయకుండా అభిప్రాయాలు చెప్పాలని లోపలకు అనుమతించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన స్థానికులు ముఖ్యంగా మహిళలు అదానీ గంగవరం పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోర్టు కాలుష్యం నుంచి కాపాడాలని తాము చాలాకాలంగా కోరుతుంటే పట్టించుకోకుండా, ఇప్పుడు మరో కాలుష్య పరిశ్రమ అంబుజా సిమెంట్స్‌ను ఎలా ఏర్పాటు చేస్తారంటూ ప్రశ్నించారు. 'గో బ్యాక్ అదానీ', 'గో బ్యాక్ అంబుజా'...అంటూ నినాదాలు చేశారు. 'పరిశ్రమలు..పెట్టుబడులు..ఉపాధి అవకాశాలు' అంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వ పెద్దలకు ప్రజల ఆరోగ్యం పట్టదా?, ప్రాణాలు తీసే పరిశ్రమలు అనుమతిస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ ఆందోళన తీవ్రరూపం దాల్చింది. కుర్చీలను బయటకు విసిరేశారు. బారికేడ్లు తొలగించారు. చివరకు వేదికను కూడా కూల్చివేశారు. పోలీసులు కొందరు నిరసనకారులను ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది.

వేదికకు దూరంగా అధికారులు

ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ప్రొటోకాల్ డ్యూటీకి ఆర్‌డీఓ శ్రీలేఖ, ఏపీ పీసీబీ నుంచి ఈఈ ముకుందరావు, పెదగంట్యాడ తహశీల్దార్ అమల మైదానం వద్దకు వచ్చారు. అయితే ఆందోళన తీవ్రంగా ఉండడంతో పోలీసులు వారిని వేదిక వద్దకు రానీయలేదు. వెనుకనున్న తహశీల్దార్ కార్యాలయంలోనే ఉంచేశారు.

వేదికపై అదానీ మనుషులు !

ప్రజాభిప్రాయ సేకరణ వేదికపై అదానీ గ్రూపునకు చెందిన వ్యక్తులు పెద్ద సంఖ్యలో మోహరించారు. జరుగుతున్న ఆందోళన అంతా ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో వీడియో ద్వారా తమ పెద్దలకు చూపించారు. వేదిక వద్దకు సీఐటీయూ నాయకుడు కుమార్ చేరుకొని నిరసన వ్యక్తంచేయగా ఆయన్ను పోలీసులతో బయటకు పంపించే వరకు అదానీ మనుషులు ఒప్పుకోలేదు.

ఆర్‌డీఓ మాట వినని ఆందోళనకారులు

మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆర్‌డీఓ శ్రీలేఖ, పీసీబీ ఈఈ ముకుందరావుతో కలిసి మైదానంలోకి ప్రవేశించారు. మహిళలు, సీనియర్ సిటిజన్లు గుంపులు గుంపులుగా కనిపించగా వారితో మాట్లాడడానికి యత్నించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడానికి అవకాశం ఇవ్వాలని, అభిప్రాయాలు చెప్పాలని ఆమె నచ్చజెప్పడానికి యత్నించగా మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. కార్యక్రమం రద్దు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని వారు చెప్పడంతో చేసేది లేక ఆమె ఈఈతో కలిసి తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లిపోయారు.

సీఎంఓ నుంచి ప్రాజెక్టుపై ఆరా

ఈ ఆందోళన, నిరసన అంతా టీవీ ఛానళ్లలో రావడంతో సీఎంఓ నుంచి విశాఖపట్నం అధికారులకు ఫోన్ చేసి, అంబుజా సిమెంట్ ప్రాజెక్టు వివరాలు అర్జంట్‌గా పంపాలంటూ కోరడం గమనార్హం. దీంతో అధికారులు అప్పటికప్పుడు వివరాలు పంపించారు.

మమ అనిపించేందుకు మంతనాలు

అంబుజా సిమెంట్స్ ఏర్పాటుకు ఏదో విధంగా ప్రజాభిప్రాయ సేకరణ చేయడానికి అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఆందోళన మధ్యాహ్నం ఒంటి గంటకే ముగిసిపోగా అధికారులు సాయంత్రం ఆరు గంటల వరకు పెదగంట్యాడలోనే ఉన్నారు. అదానీకి అనుకూలమైన వారితో చిన్న సమావేశం ఏర్పాటుచేసి, అభిప్రాయాలు తీసుకొని మమ అనిపించాలని యత్నించారు. మరోవైపు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్థానిక రాజకీయ పార్టీల నాయకులను సాయంత్రం ఐదు గంటలకు పెదగంట్యాడ తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించుకొని చర్చలు జరిపారు. ప్రజలు పరిశ్రమను వ్యతిరేకించినా, అంగీకరించినా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం అనివార్యమని, దీనికి సహకరించాలని కోరారు. అందరికీ అంగీకారమైతే అక్కడికక్కడే అందరి అభిప్రాయాలు తీసుకుంటామని చెప్పారు. దీనికి సదరు నాయకులు అంగీకరించలేదు. అయితే ఈ నెలాఖరులోగా తేదీని ఖరారు చేస్తామని, అప్పుడు అంతా వచ్చి అభిప్రాయాలు చెప్పాలని, ఆందోళన చేయవద్దని జేసీ సూచించారు.

ప్రజాభిప్రాయమే ఫైనల్

... 5వ పేజీ తరువాయి

వస్తుందని ప్రజలు భయపడుతున్నారన్నారు. దానిపై అభయం ఇవ్వాల్సిన బాధ్యత యాజమాన్యానికి ఉందన్నారు. ప్రజలు ఏదైతే అభిప్రాయాలు వెల్లడించారో అదే ఫైనల్ అని స్పష్టంచేశారు. ప్రజల నిర్ణయానికే తాము కట్టుబడి ఉంటామన్నారు. అయితే ఇదే అదనుగా కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం యత్నిస్తారని, వారి మాటలు విశ్వసించవద్దని సూచించారు.

రహదారులకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

జాతీయ రహదారి నుంచి పద్మనాభం మండలం రేవిడి, వెంకటాపురం వయా ఇందాడ, కోలాడ, మజ్జిపేట వరకు ఉన్న 9.06 కిలోమీటర్ల మేర రహదారి మరమ్మతు, అదనపు లేయర్ పనులకు రూ.3.65 కోట్లు మంజూరుచేసింది. ఈ పనులు చేపట్టేందుకు ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కొద్దిరోజుల్లో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. చిన్న చిన్న రోడ్లు డిసెంబరులోగా, ఎక్కువ కిలోమీటర్లు ఉన్న రహదారుల పనులు మార్చిలోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కె.జాన్ సుధాకర్ తెలిపారు. వీలైనంత వేగంగా పనులు చేపడతామన్నారు.

ఏయూ రెక్టార్‌గా ప్రొఫెసర్ పి.కింగ్

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్‌గా కెమికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ పులిపాటి కింగ్ నియమితులయ్యారు. ఈమేరకు వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బుధవారం ఆయనకు నియామక ఉత్తర్వులను అందించి అభినందించారు. రెక్టార్‌గా నియమితులైన ప్రొఫెసర్ పి.కింగ్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్స్ చీఫ్ వార్డెన్‌గా, కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పనిచేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ అకాడమీషియన్ అవార్డును, అమెరికాకు చెందిన ఇండస్ ఫౌండేషన్ టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు.

రౌడీ మూకల అడ్డాగా మద్దిలపాలెం

- మద్యం, గంజాయి మత్తులో ఆకతాయిల అల్లరి చేష్టలు
- రాత్రి వేళల్లో కేకలు వేస్తూ రోడ్లపై తిరుగుతూ హల్‌చల్
- అకారణంగా గొడవలకు దిగుతూ హంగామా
- భయాందోళనలో వాహన చోదకులు, స్థానికులు
- కానరాని పోలీస్ పెట్రోలింగ్

మద్దిలపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలో రౌడీమూకలు హల్‌చల్ చేస్తున్నారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవిస్తూ రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రుళ్లు రోడ్డులపై గొడవలు పడుతూ భయానక వాతవరణం సృష్టిస్తున్నారు. మద్దిలపాలెం జాతీయ రహదారిపై ఆటోమోటివ్ నుంచి సత్యం వరకు మూడు బార్ అండ్ రెస్టారెంట్లు, నాలుగు మద్యం దుకాణాలు ఉన్నాయి. స్థానిక ఆకతాయిలు, రౌడీమూకలు ఆయా దుకాణాల్లో మద్యం తీసుకుని అర్ధరాత్రి వరకు రోడ్డులపై తిరుగుతున్నారు. పది నుంచి పదిహేను మంది వరకు గుంపులుగా ఒకే చోట మద్యం మత్తులో ఉండడం, ఆకతాయి చేష్టలకు పాల్పడుతుండడంతో స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కిన్నెర థియేటర్ వద్ద మందుబాబులు అల్లర్లు ఎక్కువయ్యాయి. రోడ్డు మీదే బైకులు పార్కింగ్ చేసి హల్‌చల్ చేస్తున్నారు. మంగళవారం కూడా ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు. రౌడీషీటర్ గౌరీ కత్తి పట్టుకుని రెచ్చిపోయాడు. మద్దిలపాలెంలో నివాసముంటున్న పవన్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటనలో పదుల సంఖ్యలో రౌడీమూకలు చేరుకుని థియేటర్ బయట రెచ్చిపోయారు. దీంతో స్థానికులు భయాందోళనలతో పరుగులు తీశారు. దుకాణాదారులు హడలిపోయి మూసివేసి వెళ్లిపోయారు. పవన్ ఫిర్యాదు మేరకు ఎంవీపీకాలనీ పోలీసులు బుధవారం సంఘటన స్థలంలో విచారణ చేపట్టారు.


కిన్నెర థియేటర్ వద్ద కొట్లాట ఘటన వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కానరాని పోలీస్ పెట్రోలింగ్..

మద్దిలపాలెంలో పోలీస్ పెట్రోలింగ్ చేయడం లేదు. దీంతో చైతన్యనగర్, మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్, కిన్నెర థియేటర్ జంక్షన్, బార్ల వద్ద మందు బాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. అర్ధరాత్రి 2 గంటల వరకు గుంపులుగా ఉంటూ హల్‌చల్ చేస్తున్నారు. అర్ధరాత్రి విధులు నిర్వహించుకొని వెళ్లే వారిపై కూడా కొందరు అకారణంగా గొడవకు దిగుతుండడం పరిపాటిగా మారింది. మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు అర్ధరాత్రి కూడా దూర ప్రాంతాల నుంచి బస్సులు వస్తుంటాయి. ఆ సమయంలో వచ్చే ప్రయాణికులు మద్దిలపాలెం రోడ్లపైకి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇటీవల మద్దిలపాలెం మద్యం షాపుల వద్ద మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం బాటిళ్లతో ప్రయాణికులను బెదిరించారు. పోలీసుల గస్తీ లేనందునే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. వారానికి ఒక్కరోజు కూడా పోలీస్ పెట్రోలింగ్ లేకపోవడంతో రౌడీ మూకలు విజృంభిస్తున్నారని మండిపడుతున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి సమయానికి మద్యం దుకాణాలు మూయించడమే కాకుండా ఆకతాయిలు, రౌడీమూకల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

దురుద్దేశంతోనే జగన్ విశాఖ పర్యటన

- వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



సిరిపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీల సందర్శన పేరుతో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న పర్యటనల వెనుక రాజకీయ స్వార్థ ప్రయోజనాలు దాగి ఉన్నాయని, దురుద్దేశంతోనే ఆయన ఉన్నారని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో విమర్శించారు. వైసీపీ నాయకుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. కూటమి పాలనలో ప్రశాంతంగా ఉన్న విశాఖ నగరంలో అల్లర్లు సృష్టించేందుకు వైసీపీ నాయకులు ఎత్తుగడలు వేస్తున్నారని, దీన్ని నగర వాసులు గమనించాలన్నారు. మెడికల్ కాలేజీలకు కేటాయించిన నిధులతో పార్టీ కార్యాలయాలు కట్టుకున్న విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. పీపీపీ పద్ధతి అంటే.. ఆస్పత్రుల నిర్వహణ అంతా ప్రభుత్వమే చూసుకుంటుందనే కనీస పరిజ్ఞానం కూడా లేకుండా వైసీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలతో పాటు ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికతో ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తుంటే, వైసీపీ నాయకులు ప్రశాంత వాతావరణాన్ని పాడుచేసేందుకు తమ వంతుగా ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు బుద్ధి తెచ్చుకొని నగర అభివృద్ధికి సహకరించాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల పంపిణీ


సహాయార్థులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో తీవ్ర అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం అందజేశారు. వీరిలో ఆరిలోవకు చెందిన చలివేంద్ర సన్యాసమ్మకు రూ.27 వేలు, విశాలాక్షినగర్ పోలీస్ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన జన చాముండేశ్వరికి రూ.1,65,380లు, విశాలాక్షినగర్ ప్రాంతానికి చెందిన మేక శ్రీదేవికి రూ.50 వేలు, ఎంవీపీ కాలనీ గొల్లవీధికి చెందిన ముచ్చి రవికుమార్‌కు రూ.31, 500లు, మహారాణీపేటకు చెందిన పాడిశెట్టి రమణకు రూ.1.12 లక్షలు విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, టీడీపీ నేతలు నక్క కనకరాజు, అక్కరబోయిన రాంబాబు, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

10న అండర్ -14 జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలు

ఆరిలోవ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ క్యాలెండర్ ప్రకారం 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా అధ్వర్యంలో ఈ నెల 10న ఉదయం 8 గంటలకు జిల్లా స్థాయి అండర్ -14 క్రికెట్ బాయిస్ సెలక్షన్ ట్రైల్స్ వైజాగ్ క్రికెట్ అకాడమి నియర్ వుడా పార్కులో నిర్వహించనున్నట్టు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు తమ సొంత కిట్లు, క్రికెట్ డ్రెస్‌తో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం స్కూలు గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ టి.నాగేశ్వరరావు 9000019048ను సంప్రదించాలని కోరారు.

వాల్తేరు రైల్వే ఏడీఆర్‌ఎం బాధ్యతల స్వీకారం


ఏడీఆర్‌ఎం రామారావు

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా (ఏడీఆర్‌ఎం) కుందు రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రామారావు...5వ తరగతి వరకు ఎంపీపీ స్కూల్, 10వ తరగతి వరకు జిల్లా పరిషత్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. పాలిటెక్నిక్ నుంచి ఇంజనీరింగ్‌లోకి ప్రవేశించి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 2006లో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) పరీక్షలో దేశ వ్యాప్తంగా 44వ ర్యాంకు సాధించి ఇండియన్ రైల్వే సర్వీసెస్ ఆఫ్ ఇంజనీర్స్‌లో చేరారు. భారతీయ రైల్వేలో వివిధ జోన్‌లలో కీలక హోదాలో విధులు నిర్వహించారు.నాగపూర్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా...బిలాస్‌పూర్, విజయవాడ డివిజన్లలో సీనియర్ డివిజనల్ ఇంజనీర్‌గా, గుంటూరు డివిజన్‌లో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (ట్రాక్ మెషిన్స్) పనిచేస్తూ బదిలీపై వాల్తేరు డివిజన్‌కు వచ్చారు. రైల్వే కార్యకలాపాలలో విశేష అనుభవం కలిగిన రామారావు...జపాన్‌లో హైస్పీడ్ రైలు కార్యకలాపాలపై ప్రత్యేక శిక్షణ పొందారు. తన తల్లిని స్ఫూర్తిగా తీసుకుని భారతీయ రైల్వేలో ఉద్యోగం పొందాలనే పట్టుదలతో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ పూర్తి చేసి ఉన్నతస్థాయిఅధికారిగా పనిచేస్తున్న రామారావుకు చెస్‌క్రీడపై ఆసక్తి ఉంది.

అనుమతులిచ్చిన రూట్‌లోనే జగన్ పర్యటన

- వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త, మాజీ మంత్రి కురసాల కన్నబాబు


విలేకరులతో మాట్లాడుతున్న వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త కురసాల కన్నబాబు, పాల్గొన్న మాజీ మంత్రి అమర్‌నాథ్, పేడాడ రమణికుమారి తదితరులు

మద్దిలపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి విశాఖ ఉమ్మడి జిల్లా పర్యటన పోలీసులు అనుమతులు ఇచ్చిన రూట్‌లోనే కొనసాగించడానికి నిర్ణయించినట్టు ఆ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 9న ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఎన్‌ఏడీ, గోపాలపట్నం, పెందుర్తి మీదుగా మాకవరంలో నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు వెళ్తారని చెప్పారు. మెడికల్ కళాశాల సందర్శించిన తర్వాత నేరుగా కేజీహెచ్‌కు చేరుకుంటారని వెల్లడించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం వసతి గృహం గిరిజన విద్యార్థులను పరామర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను పోలీసులకు తెలియజేస్తున్నామన్నారు. కురుపాం వసతి గృహంలో 150 మంది వరకు గిరిజన బాలికలకు పచ్చకామెర్లు సోకాయన్నారు. పార్వతీపురం ప్రభుత్వ ఆస్పత్రి, ఆ సమీప ఆస్పత్రుల్లో 70 మందికి చికిత్స అందిస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. కేజీహెచ్‌లో 50 మంది బాలికలకు చికిత్స అందిస్తున్నారని, వారినే జగన్ పరామర్శిస్తారని చెప్పారు. తాగునీరు కూడా అందివ్వలేని ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వందలాది మంది పిల్లలు ఆస్పత్రి పాలయ్యారని కన్నబాబు విమర్శించారు. జగన్ పర్యటనకు విపరీతమైన ఆంక్షలు పెట్టడమే కాకుండా నాయకులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు, ఇతర అధికారులు మరీ దారుణంగా పని చేయడమనేది మంచి పద్ధతి కాదన్నారు. ప్రతిపక్ష పార్టీ గళం విప్పుతుంటే దాన్ని అణిచవేయడానికి ప్రభుత్వం చేతిలో ఆయుధంగా అధికారులు పనిచేయడంసరైన విధానంకాదన్నారు.

జీఎస్టీ 2-0 విద్యార్థులకు ప్రధాని మోదీ కానుక

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు



జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ అధ్యక్షుడు పరుశురామరాజు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకృష్ణ, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాలకృష్ణ, కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

మద్దిలపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జీఎస్టీ 2.0 విద్యార్థులకు సూపర్ గిఫ్ట్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్' పేరిట నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేశారు.

ఈ సందర్భంగా పరశురామ్‌రాజు మాట్లాడుతూ కేంద్రం అమలు చేసిన జీఎస్టీ 2.0తో విద్యార్థులకు స్టేషనరీ భారం తగ్గిందన్నారు. విద్యార్థులు తమకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తగ్గించిన జీఎస్టీ ప్రకారం మాత్రమే నగదు చెల్లించాలని సూచించారు. విద్యారంగానికి, విద్యార్థులకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.శ్రీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తగ్గించిన జీఎస్టీ రేట్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. 12 శాతం జీఎస్టీ ఉన్న వ్యాయామం, గ్రాఫ్, ల్యాబ్ నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, పేపర్లు, మ్యాప్‌లు, అట్లాస్, గ్లోబ్‌లు, పెన్సిళ్లు, క్రేయాన్లు, పాస్టెల్లు, బొగ్గు, పెన్సిల్ షార్పనర్లు, ఎరేజర్లకు జీఎస్టీ లేదన్నారు. జ్యామితి, రంగు పెట్టెలు, పేపర్ కార్టన్లు, పెట్టెలు, పేపర్ అచ్చువేసిన ట్రేలకు 5 శాతం జీఎస్టీ చెల్లిస్తే చాలన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాలకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాది బుగతకు ఎమ్మెల్యే అభినందనలు


బుగత సత్యనారాయణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు స్వీకరించిన బుగత సత్యనారాయణనుశాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపి, శాలువతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం నాయకులు బోర ధనరెడ్డి, నాగరాజు, శివరామకృష్ణ, మొవ్వ శ్రీనివాస్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేరేవరకు పోరాటం

- లారీ సప్లయర్స్, ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు

సీతంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): లోడింగ్ అన్‌లోడింగ్ చార్జీలు పూర్తిగా ఎత్తివేయాలని విశాఖ ట్రాన్స్‌పోర్ట్ సప్లయర్స్ ఎలియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో వీటీఎస్ఎడబ్ల్యుఎ (జేఏసీ) ఆధ్వర్యంలో లారీ సప్లయర్స్ ఓనర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 40 ఏళ్లుగా విశాఖ జిల్లాలో 500 ట్రాన్స్‌పోర్టు ఆఫీసులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మంది ఉపాధి సాగిస్తున్నామని, తామంతా ఐక్యంగా ఉండేందుకు జేఏసీగా ఏర్పడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

'మెడికవర్'లో క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

ఆరిలోవ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో క్యాన్సర్ మరణాలను నివారించేందుకు ప్రారంభ దశలోవ్యాధి లక్షణాలను గుర్తించి క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి అన్నారు. ఆమె బుధవారం ఆరిలోవ హెల్త్ సిటీ లో గల మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళల్లో క్యాన్సర్‌పై పోరాటం - నెల రోజుల ఉచిత స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు రోగ నిరోధక ఆరోగ్య సేవలు విస్తరించడంలో మెడికవర్ చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. ఈ సేవలు మెడికవర్ ఆస్పత్రిలో ప్రతి సోమవారం 9 గంటల నుంచి శనివారం సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. 30 ఏళ్ళకు పైబడిన మహిళలు తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆంకాలజిస్టు రమావత్‌దేవ్, డాక్టర్లు సాహిత్య, కార్తీక్ చంద్ర్, ఎ.రమేష్, అభిలాష పాల్గొన్నారు.

కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతంలో సమస్యల పరిష్కారానికి కృషి


స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీవిద్య

వెంకోజీపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య వార్డులోని కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతంలో బుధవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ కాలువల సమస్య గురించి స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే కార్పొరేటర్ పబ్లిక్ వర్క్స్ ఏఈ చందుని పిలిపించి సమస్యలను వివరించి వెంటనే కాలువల మరమ్మతుల పనులు, రోడ్డు పనులకు అంచనా వ్యయాన్ని రూపొందించాలని ఆదేశించారు. ఈ సమస్యను తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి కూడా తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి, పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ శ్రీవిద్య హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పారి గిరిబాబు, బీశెట్టి జగదీశ్, పెట్ల రాజు, నరాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 26, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 32, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 56, దొండకాయలు 36, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 72, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 58, కీరదోస 26, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఘటించండి

- ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ


ఎంవీపీ కాలనీలో జరిగిన ఓట్ చోర్ గద్దె చోడ్ ర్యాలీలో పాల్గొన్న ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ, శ్రీనివాసరావు తదితరులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) :అప్రజాస్వామిక కేంద్ర ప్రభుత్వ విధానాలపై అందరూ ఉద్యమించాలని ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ పిలుపునిచ్చారు. ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణమండపం నుంచి క్యాన్సర్ ఆస్పత్రి మీదుగా లుంబినీ పార్కు వరకూ బుధవారం కాంగ్రెస్ పార్టీ ' ఓట్ చోర్ గద్దె చోడ్' అనే నినాదంతో చేపట్టిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. 'ఓట్ల దొంగ గద్దె దిగండి' అనే నినాదాలతో ర్యాలీ సాగింది. కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా మాజీ అధ్యక్షుడు గుండ్ల కుంట్ల శ్రీరాములు, విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి గుత్తుల శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు మౌనిక రెడ్డి, పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ పారా అథ్లెటిక్స్‌లో ప్రణయ్‌కు పతకం



విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన ఎ.ప్రణయ్ పతకం సాధించాడు. గ్వాలియర్‌లో జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల 1500 మీటర్ల పరుగులో ప్రణయ్ అద్భుతంగా రాణించి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ప్రణయ్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామ రామవర్ధన్ బాధ్యత తీసుకుని విద్య, క్రీడా రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. రైల్వే అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో కోచ్ పిట్టా శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందుతున్న ప్రణయ్...రాష్ట్ర స్థాయి టోర్నీలలో అనేక పతకాలు సాధించాడు. త్వరలో జరగనున్న అంతర్జాతీయ అథ్లెటిక్స్ టోర్నీకి ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయని కోచ్ శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడిగా అప్పలనాయుడు


టీడీపీ 10వ వార్డు కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

ఆరిలోవ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10 వార్డు టీడీపీ అధ్యక్షుడిగా గాడు అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్థానిక కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు ఈ ఎన్నిక 10వ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడుగా గాడు అప్పలనాయడు, కార్యదర్శిగా వేమల వెంకటరావు, ఉపాధ్యక్షులుగా చోడు గంజి అప్పలనాయడు, చనుమోలు శ్రీనివాస్, అధికార ప్రతినిధగా కర్రి వెంకటరావు ఎన్నికైనట్టు కార్పొరేటర్ రామలక్ష్మి వెల్లడించారు.

రైళ్లలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు

- 'అమృత సంవాద్'లో సూచన

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని పలువురు ప్రయాణికులు సూచించారు. సీనియర్ సిటిజన్లకు సహాయం చేసేందుకు ఎస్కలేటర్ల వద్ద కేర్‌టేకర్లను నియమించాలని, స్లీపర్ క్లాసు ప్రయాణికులకూ టికెట్ చార్జీల పరిధిలో క్యాటరింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, అనధికార విక్రయాలు నిరోధించాలని మరికొందరు సూచించారు. అమృత్ కాల్ 'పంచ్ ప్రాణ్' ప్రచారంలో భాగంగా బుధవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో 'అమృత సంవాద్' కార్యక్రమం నిర్వహించారు. స్లీపర్ క్లాసు నిరీక్షణ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ డీసీఎం పవన్‌కుమార్ హాజరై రైల్వే అధికారులు, ప్రయాణికుల మధ్య సంబంధాల మెరుగుదలపై దృష్టి సారించారు.

అమృత సంవాద్ అసలు లక్ష్యమైన ప్రయాణికులు, వినియోగదారుల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. అనంతరం అత్యుత్తమ సూచనలు చేసిన వారిని సీనియర్ డీసీఎం సత్కరించారు. డివిజన్‌లోని అన్ని ప్రధాన స్టేషన్లలో ఈ నెల 31 వరకు నిర్వహిస్తున్న అమృత సంవాద్ ప్రచార కార్యక్రమంలో ప్రయాణికులు, వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలు పంచుకోవాలని డీఆర్‌ఎం లలిత్ బొహ్రా పిలుపునిచ్చారు.

నేడు బీచ్‌రోడ్డులో 'సఖి సురక్ష'

వెంకోజీపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళల ఆరోగ్యం, సామాజిక ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరిచేందుకు మెప్మా ఆధ్వర్యంలో సఖి సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్, సాగరిక మీటింగ్ హాల్లో గురువారం ఉదయం 10 గంటలకు మెప్మా డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ప్రారంభిస్తారని జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి తెలిపారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు 16 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. 35 సంవత్సరాల వయసు దాటిన సంఘం సభ్యులకు పరీక్షలు నిర్వహించేలా మెప్మా, జాతీయ పట్టణ ఆరోగ్య సంస్థ ప్రణాళికలు సిద్ధం చేశాయన్నారు.

మహిళా రచయితల వైశిష్ట్యంపై సదస్సు

జ్ఞానాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో రెండురోజుల జాతీయ సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్సలర్ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ బుధవారం ప్రారంభించారు. స్వాతంత్ర్యానంతరం తెలుగు-హిందీ సాహిత్యంలో మహిళా రచయితల వైశిష్ట్యం, సాహిత్య ప్రక్రియల ప్రాధాన్యం తదితర అంశాలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కె.జయలక్ష్మి రాసిన కథల సంపుటి, సెమినార్ గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. సదస్సులో సుమారు 70 మంది వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలనపై ఆకస్మిక తనిఖీలు

» మాట వినకుంటే నోటీసులిచ్చి నివేదిక పంపండి » అధికారులకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశం


కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సచివాలయాల సిబ్బంది సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని, వారి పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సమయపాలన పాటించని సిబ్బందికి నోటీసులివ్వాలని జోనల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. ఎవరైనా మాట వినని పక్షంలో తనకు నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు. సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్, పీఎం సూర్యఘర్, పీ-4 మ్యాపింగ్, మార్గదర్శుల రిజిస్ట్రేషన్ స్టేటస్, తల్లికి వందనం, రైస్ కార్డుల పంపిణీ, ఆధార్ సీడింగ్, ఈకేవైసీ, సచివాలయ సిబ్బంది పనితీరు తదితర అంశాలపై బుధవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెబెక్స్ ద్వారా సమీక్షించారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా ప్రజలకు చేకూరుతున్న లబ్ధి, ఇతర ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని చాంపియన్ల సహకారంతో సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రత్యేకంగా ప్రచారం చేయాలని కోరారు. డీఆర్‌డీఏ, యూసీడీలోని మహిళల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ధరలలో వ్యత్యాసాలను విడమరిచి చెప్పాలని సూచించారు. పీ4లో భాగంగా మార్గదర్శులను బంగారు కుటుంబాలకు అనుసంధానం చేసి కార్యాచరణ మొదలు పెట్టాలని, ఎన్ఆర్ఐల సహకారం కూడా తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

మహారాణిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాలు, పాఠశాలల్లో పారిశుధ్యం లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకొని మండల, జోనల్ అధికారులు వసతిగృహాలు, పాఠశాలలను పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీటి పైప్‌లైన్ లీకులు లేకుండా చూడాలని, మరుగుదొడ్లు, సెప్టిక్‌ట్యాంక్‌ల నుంచి అనుసంధానమయ్యే పైపులను పరిశీలించి, లోపాలు ఉంటే సరిచేసి, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, డెంగ్యూ, ఇతర కాలానుగుణ వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలని కలెక్టర్ సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల పరిధిలోని వసతిగృహాలను నిరంతరం పర్యవేక్షించాలని నిర్దేశించారు. అన్ని విద్యా సంస్థలలో తాజా పరిస్థితులను పరిశీలించి తనకు నివేదిక పంపాలని ఆదేశించారు.

ఏయూ రెక్టార్‌గా ప్రొఫెసర్ పి.కింగ్

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్‌గా కెమికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ పులిపాటి కింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బుధవారం ఆయనకు నియామక ఉత్తర్వులను అందించి అభినందించారు. రెక్టార్‌గా నియమితులైన ప్రొఫెసర్ పి.కింగ్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్స్ చీఫ్ వార్డెన్‌గా, కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పనిచేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ అకాడమీషియన్ అవార్డును, అమెరికాకు చెందిన ఇండస్ ఫౌండేషన్ టీచింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు.

'మెడికవర్'లో క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

ఆరిలోవ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో క్యాన్సర్ మరణాలను నివారించేందుకు ప్రారంభ దశలో వ్యాధి లక్షణాలను గుర్తించి క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి అన్నారు. ఆమె బుధవారం ఆరిలోవ హెల్త్ సిటీలో గల మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నెల రోజుల ఉచిత స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సేవలు ప్రతి సోమవారం 9 గంటల నుంచి శనివారం సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

జాతీయ పారా అథ్లెటిక్స్‌లో ప్రణయ్‌కు పతకం



విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన ఎ.ప్రణయ్ పతకం సాధించాడు. గ్వాలియర్‌లో జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల 1500 మీటర్ల పరుగులో ప్రణయ్ అద్భుతంగా రాణించి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ప్రణయ్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామ రామవర్ధన్ బాధ్యత తీసుకుని విద్య, క్రీడారంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. రైల్వే అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో కోచ్ పిట్టా శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందుతున్న ప్రణయ్...రాష్ట్ర స్థాయి టోర్నీలలో అనేక పతకాలు సాధించాడు. త్వరలో జరగనున్న అంతర్జాతీయ అథ్లెటిక్స్ టోర్నీకి ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయని కోచ్ శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

డిమాండ్లు నెరవేరేవరకు పోరాటం

» లారీ సప్లయర్స్, ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌పోర్ట్ సప్లయర్స్ ఎలియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఎస్.వెంకటేశ్వరరావు

సీతంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): లోడింగ్ అన్‌లోడింగ్ చార్జీలు పూర్తిగా ఎత్తివేయాలని విశాఖ ట్రాన్స్‌పోర్ట్ సప్లయర్స్ ఎలియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో వీటీఎస్ఎడబ్ల్యుఎ (జేఏసీ) ఆధ్వర్యంలో లారీ సప్లయర్స్, ఓనర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అసోసియేషన్ చైర్మన్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 40 ఏళ్లుగా విశాఖ జిల్లాలో 500 ట్రాన్స్‌పోర్టు ఆఫీసులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మంది ఉపాధి సాగిస్తున్నామని, తామంతా ఐక్యంగా ఉండేందుకు జేఏసీగా ఏర్పడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు ఇక్కడ అన్‌లోడ్ చేసుకొని మళ్లీ లోడింగ్ చేసుకుంటాయని, విశాఖ జిల్లాకు వచ్చి పోయే వాహనాలు ఎగుమతి, దిగుమతులు చేసే ప్రక్రియలో చాలా మంది రుసుము ఎక్కువగా వసూలు చేస్తున్నారని, దానిని నిరోధించాలని కోరారు. బహుళ వస్తువులపై ఒక శాతం మారిన్ అమలు చేయాలని కోరారు. జేఏసీ డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్.భాస్కర్, కార్యదర్శి బి.సూర్యప్రకాశరావు, కోశాధికారి వి.వెంకటేశ్వరరావు, సాలూరు లారీ అసోసియేషన్ అధ్యక్షులు జి.మధు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయుష్...ఆపసోపాలు!

... 5వ పేజీ తరువాయి

రేవిడి, ఆనందపురం, శొంఠ్యాం, భీమునిపట్నం, మధురవాడ, అడవివరం, సింహాచలం, వేపగుంట, మింది, అగనంపూడి, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, గంపరాయి, డుంబ్రిగుడ, సీలేరు, తాజంగి, అనకాపల్లి జిల్లా సబ్బవరం, తురకలపూడి, రేగుపాలెం, సర్వసిద్ధి, కేజే పురం, వేంపాడు, నర్సీపట్నం, ఎం.కోడూరు, ఎలమంచిలి డిస్పెన్సరీల మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు. ఆయా ఆయుష్ డిస్పెన్సరీలకు వెళ్లే రోగులకు వైద్యులు లేరని సిబ్బంది చెబుతున్నారు. కొన్నిచోట్ల సిబ్బంది కూడా లేకపోవడంతో మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ఆస్తి పన్ను వసూళ్లు ఆశాజనకం

... 5వ పేజీ తరువాయి

సంప్రతింపులు ప్రారంభించారు. దీనివల్ల గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలి ఆరు నెలల్లోనే రూ.29.25 కోట్ల వరకూ బకాయిలు వసూలయ్యాయి. మరోవైపు పన్ను వసూళ్లలో పురోగతిపై కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రతి బుధవారం రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్నారు. జోన్‌ల వారీగా లక్ష్యాలు నిర్దేశించి, వాటిని ఏ మేరకు చేరుకున్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. దీంతో రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది పన్ను వసూళ్ల కోసం క్షేత్రస్థాయికి వెళ్లడం ప్రారంభించారు. దీంతో ఈ ఏడాది తొలి అర్ధసంవత్సరంలో బకాయిలతో కలుపుకుంటే రూ.256.5 కోట్లు వసూలయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధసంవత్సరం ముగిసేసరికి రూ.206.25 కోట్లు మాత్రమే వసూలు కాగా, ఈ ఏడాది రూ.50.25 కోట్లు అధికంగా వసూలైంది. మిగిలిన ఆరు నెలల్లో బకాయిలు రూ.101.42 కోట్లు, రెగ్యులర్ పన్నులు ద్వారా రూ.173.07 కోట్లు మొత్తం మరో రూ.274 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కమిషనర్ రూపొందించిన కార్యాచరణను పక్కాగా అమలుచేయడం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం రూ.530.99 కోట్లు వసూలు చేస్తామని డీసీఆర్ శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తంచేశారు.

వాల్తేరు రైల్వే ఏడీఆర్ఎం బాధ్యతల స్వీకరణ


ఏడీఆర్ఎం రామారావు

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా (ఏడీఆర్ఎం) కుందు రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రామారావు పాలిటెక్నిక్ నుంచి ఇంజనీరింగ్‌లోకి ప్రవేశించి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 2006లో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) పరీక్షలో దేశ వ్యాప్తంగా 44వ ర్యాంకు సాధించి ఇండియన్ రైల్వే సర్వీసెస్ ఆఫ్ ఇంజనీర్స్‌లో చేరారు. భారతీయ రైల్వేలో వివిధ జోన్‌లలో కీలక హోదాలో విధులు నిర్వహించారు. నాగపూర్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా...బిలాస్‌పూర్, విజయవాడ డివిజన్లలో సీనియర్ డివిజనల్ ఇంజనీర్‌గా, గుంటూరు డివిజన్‌లో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (ట్రాక్ మెషీన్స్) పనిచేస్తూ బదిలీపై వాల్తేరు డివిజన్‌కు వచ్చారు. రైల్వే కార్యకలాపాలలో విశేష అనుభవం కలిగిన రామారావు...జపాన్‌లో హైస్పీడ్ రైలు కార్యకలాపాలపై ప్రత్యేక శిక్షణ పొందారు. తన తల్లిని స్ఫూర్తిగా తీసుకుని రైల్వేలో ఉద్యోగం పొందాలనే పట్టుదలతో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ పూర్తి చేసి ఉన్నత స్థాయి అధికారిగా పని చేస్తున్న రామారావుకు చెస్ క్రీడపై ఆసక్తి ఉంది.

కెమికల్ విద్యార్థులకు 90 గంటల శిక్షణ


శిక్షణ పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపకులు

కంచరపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సమగ్ర వృత్తి శిక్షణ, సామాజిక పరివర్తన కార్యక్రమంలో భాగంగా ఉన్నతి ఫౌండేషన్ కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు 90 గంటల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. బుధవారం ఏర్పాటు చేసిన ముగింపు సమావేశం సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఉన్నత ఫౌండేషన్ తమ కళాశాల్లో పెట్రోకెమికల్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, విలువలు, నైపుణ్యాలపై చక్కని శిక్షణ అందించిందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయన్నారు. పెట్రో కెమికల్స్ ఆఖరి సెమిస్టర్ చదువుతున్న 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు గల విద్యార్థులు ఈ శిక్షణ పొందారు. ఆయా విభాగాధిపతులు జయప్రకాశ్ రెడ్డి, సీనియర్ లెక్చరర్ ఎం.భూదమ్మ, కేబీవీఎస్ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సందేశ కావ్యం కాళిదాసు 'మేఘ సందేశం'



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దేవులపల్లి పద్మజ

సీతంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాల్లో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ దేవులపల్లి పద్మజచే మహాకవి కాళిదాసు రచించిన మేఘ సందేశంపై ప్రసంగ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆమె ప్రసంగిస్తూ మొట్టమొదటి సందేశ కావ్యం మేఘదూతం అని పేర్కొన్నారు. సందేశ సారాంశం, అలకాపురి వర్ణన వివరించారు. సభాధ్యక్షత వహించిన డాక్టర్ కె.జి.వేణు ఆమె ప్రసంగాన్ని విశ్లేషిస్తూ కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలోని నాటకీయతను వివరించారు. ఈ సభలో సీహెచ్ చిన సూర్యనారాయణ, డాక్టర్ బండి సత్యనారాయణ, డీబీఆర్ శర్మ, సీహెచ్ నందగోపాలరావు, భాగవతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కేవీఎస్ మూర్తి, కేవీ రామారావు పాల్గొన్నారు.

గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయులదే

» ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు


హనుమంతు ప్రభాకర్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు గాదె, వేపాడ తదితరులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎప్పటికీ గౌరవ ప్రదమైన వృత్తి ఉపాధ్యాయులదేనని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు అన్నారు. బుధవారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో రమాదేవి భానోజీరావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ ఆత్మీయ సత్కార సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేపాడ చిరంజీవిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా జీవించడమే దేవుడు ఇచ్చిన గొప్పవరంగా భావించాలన్నారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ రమాదేవి భానోజీరావు పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడంలో ప్రభాకర్ కృషి ఉందన్నారు. హనుమంతు ప్రభాకర్ మాట్లాడుతూ అందరి సహకారంతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పన సాధ్యపడిందన్నారు. అనంతరం అతిథులు ప్రభాకర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా రచయితల వైశిష్ట్యంపై సదస్సు



ప్రసంగిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

జ్ఞానాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్సలర్ ఆచార్య వి.బాలమోహన్‌దాస్‌లు బుధవారం ప్రారంభించారు. స్వాతంత్ర్యానంతరం తెలుగు-హిందీ సాహిత్యంలో మహిళా రచయితల వైశిష్ట్యం, సాహిత్య ప్రక్రియల ప్రాధాన్యం వంటి అంశాలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి రచించిన కథల సంపుటిని, అలాగే సెమినార్ గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈ సదస్సులో సుమారు 70 మంది వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులు, రాజభాష అధికారులు పాల్గొన్నారు. సదస్సులో డా.ఎస్ కృష్ణబాబు, డా.డి.వి. సుబ్బారావు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్ దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటరత్నం పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

జాతీయ రహదారి నుంచి పద్మనాభం మండలం రేవిడి, వెంకటాపురం వయా ఇందాడ, కోలాడ, మజ్జిపేట వరకు ఉన్న 9.06 కిలోమీటర్ల మేర రహదారి మరమ్మతు, అదనపు లేయర్ పనులకు రూ.3.65 కోట్లు మంజూరుచేసింది. ఈ పనులు చేపట్టేందుకు ఇప్పటికే ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కొద్దిరోజుల్లో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. చిన్న చిన్న రోడ్లు డిసెంబరులోగా, ఎక్కువ కిలోమీటర్లు ఉన్న రహదారుల పనులు మార్చిలోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు ఆర్అండ్‌బీ ఎస్ఈ కె.జాన్ సుధాకర్ తెలిపారు. వీలైనంత వేగంగా పనులు చేపడతామన్నారు.

ప్రజాభిప్రాయమే ఫైనల్

... 5వ పేజీ తరువాయి

వస్తుందని ప్రజలు భయపడుతున్నారన్నారు. దానిపై అభయం ఇవ్వాల్సిన బాధ్యత యాజమాన్యానికి ఉందన్నారు. ప్రజలు ఏదైతే అభిప్రాయాలు వెల్లడించారో అదే ఫైనల్ అని స్పష్టంచేశారు. ప్రజల నిర్ణయానికే తాము కట్టుబడి ఉంటామన్నారు. అయితే ఇదే అదనుగా కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం యత్నిస్తారని, వారి మాటలు విశ్వసించవద్దని సూచించారు.

రైళ్లలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు

» 'అమృత సంవాద్'లో సూచన


మంచి సూచనలు చేసిన ప్రయాణికుడికి అవార్డు ఇస్తున్న సీనియర్ డీసీఎం పవన్‌కుమార్

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని పలువురు ప్రయాణికులు సూచించారు. సీనియర్ సిటిజన్లకు సహాయం చేసేందుకు ఎస్కలేటర్ల వద్ద కేర్ టేకర్లను నియమించాలని, స్లీపర్ క్లాసు ప్రయాణికులకూ టికెట్ చార్జీల పరిధిలో క్యాటరింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, అనధికార విక్రయాలు నిరోధించాలని మరికొందరు సూచించారు. అమృత్ కాల్ 'పంచ్ ప్రాణ్' ప్రచారంలో భాగంగా బుధవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో 'అమృత సంవాద్' కార్యక్రమం నిర్వహించారు. స్లీపర్ క్లాసు నిరీక్షణ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ డీసీఎం పవన్‌కుమార్ హాజరై రైల్వే అధికారులు, ప్రయాణికుల మధ్య సంబంధాల మెరుగుదలపై దృష్టి సారించారు. అమృత సంవాద్ అసలు లక్ష్యమైన ప్రయాణికులు, వినియోగదారుల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. అనంతరం అత్యుత్తమ సూచనలు చేసిన వారిని సీనియర్ డీసీఎం సత్కరించారు. డివిజన్‌లోని అన్ని ప్రధాన స్టేషన్లలో ఈ నెల 31 వరకు నిర్వహిస్తున్న అమృత సంవాద్ ప్రచార కార్యక్రమంలో ప్రయాణికులు, వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలు పంచుకోవాలని డీఆర్ఎం లలిత్ బొహ్రా పిలుపునిచ్చారు.

గో బ్యాక్...అంబుజా

... 5వ పేజీ తరువాయి

కమిటీ కన్వీనర్ అయోధ్యరామ్, తదితరులు చేరుకుని ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారిని హార్బర్ ఏసీపీ కాళిదాసు గేటు వద్దనే కొద్దిసేపు ఆపేశారు. ఆందోళన చేయకుండా అభిప్రాయాలు చెప్పాలని లోపలకు అనుమతించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన స్థానికులు ముఖ్యంగా మహిళలు అదానీ గంగవరం పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోర్టు కాలుష్యం నుంచి కాపాడాలని తాము చాలాకాలంగా కోరుతుంటే పట్టించుకోకుండా, ఇప్పుడు మరో కాలుష్య పరిశ్రమ అంబుజా సిమెంట్స్‌ను ఎలా ఏర్పాటు చేస్తారంటూ ప్రశ్నించారు. 'గో బ్యాక్ అదానీ', 'గో బ్యాక్ అంబుజా'...అంటూ నినాదాలు చేశారు. 'పరిశ్రమలు..పెట్టుబడులు..ఉపాధి అవకాశాలు' అంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వ పెద్దలకు ప్రజల ఆరోగ్యం పట్టదా?, ప్రాణాలు తీసే పరిశ్రమలు అనుమతిస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ ఆందోళన తీవ్రరూపం దాల్చింది. కుర్చీలను బయటకు విసిరేశారు. బారికేడ్లు తొలగించారు. చివరకు వేదికను కూల్చివేశారు. పోలీసులు కొందరు నిరసనకారులను ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది.

వేదికకు దూరంగా అధికారులు

ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ప్రొటోకాల్ డ్యూటీకి ఆర్‌డీఓ శ్రీలేఖ, ఏపీ పీసీబీ నుంచి ఈఈ ముకుందరావు, పెదగంట్యాడ తహశీల్దార్ అమల మైదానం వద్దకు వచ్చారు. అయితే ఆందోళన తీవ్రంగా ఉండడంతో పోలీసులు వారిని వేదిక వద్దకు రానీయలేదు. వెనుకనున్న తహశీల్దార్ కార్యాలయంలోనే ఉంచేశారు.

వేదికపై అదానీ మనుషులు!

ప్రజాభిప్రాయ సేకరణ వేదికపై అదానీ గ్రూపునకు చెందిన వ్యక్తులు పెద్ద సంఖ్యలో మోహరించారు. జరుగుతున్న ఆందోళన అంతా ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో వీడియో ద్వారా తమ పెద్దలకు చూపించారు. వేదిక వద్దకు సీఐటీయూ నాయకుడు కుమార్ చేరుకొని నిరసన వ్యక్తంచేయగా ఆయన్ను పోలీసులతో బయటకు పంపించే వరకు అదానీ మనుషులు ఒప్పుకోలేదు.

ఆర్‌డీఓ మాట వినని ఆందోళనకారులు

మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆర్‌డీఓ శ్రీలేఖ, పీసీబీ ఈఈ ముకుందరావుతో కలిసి మైదానంలోకి ప్రవేశించారు. మహిళలు, సీనియర్ సిటిజన్లు గుంపులు గుంపులుగా కనిపించగా వారితో మాట్లాడడానికి యత్నించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడానికి అవకాశం ఇవ్వాలని, అభిప్రాయాలు చెప్పాలని ఆమె నచ్చజెప్పడానికి యత్నించగా మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఈ కార్యక్రమం రద్దు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని వారు స్పష్టంచేయడంతో చేసేది లేక ఆమె ఈఈతో కలిసి తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లిపోయారు.

సీఎంఓ నుంచి ప్రాజెక్టుపై ఆరా

ఈ ఆందోళన, నిరసన అంతా టీవీ ఛానళ్లలో రావడంతో సీఎంఓ నుంచి విశాఖపట్నం అధికారులకు ఫోన్ చేసి, అంబుజా సిమెంట్ ప్రాజెక్టు వివరాలు అర్జంట్‌గా పంపాలంటూ కోరడం గమనార్హం. దీంతో అప్పటికప్పుడు వివరాలు పంపించారు.

మమ అనిపించేందుకు మంతనాలు

అంబుజా సిమెంట్స్ ఏర్పాటుకు ఏదో విధంగా ప్రజాభిప్రాయ సేకరణ చేయడానికి అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఆందోళన మధ్యాహ్నం ఒంటి గంటకే ముగిసిపోగా అధికారులు సాయంత్రం ఆరు గంటల వరకు పెదగంట్యాడలోనే ఉన్నారు. అదానీకి అనుకూలమైన వారితో చిన్న సమావేశం ఏర్పాటుచేసి, అభిప్రాయాలు తీసుకొని మమ అనిపించాలని యత్నించారు. మరోవైపు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్థానిక రాజకీయ పార్టీల నాయకులను సాయంత్రం ఐదు గంటలకు పెదగంట్యాడ తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించుకొని చర్చలు జరిపారు. ప్రజలు పరిశ్రమను వ్యతిరేకించినా, అంగీకరించినా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం అనివార్యమని, దీనికి సహకరించాలని కోరారు. అందరికీ అంగీకారమైతే అక్కడికక్కడే అందరి అభిప్రాయాలు తీసుకుంటామని చెప్పారు. దీనికి నాయకులు అంగీకరించలేదు. అయితే ఈ నెలాఖరులోగా తేదీని ఖరారు చేస్తామని, అప్పుడు అంతా వచ్చి అభిప్రాయాలు చెప్పాలని, ఆందోళన చేయవద్దని జేసీ సూచించారు.

గెడ్డ కాలువ పనులు ప్రారంభం


పనులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు

సీతమ్మధార, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డులో సీతమ్మధార టీపీటీ కాలనీ, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంతంలో రూ.17 లక్షలతో గెడ్డ కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ పనులను బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, ఇతర కూటమి నాయకులు బుధవారం పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ శివప్రసాద్, నాయకులు ఎండీ నజీర్, బర్ల బాలకృష్ణ, మజ్జి ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వసతులు ఉన్నా వైద్యులు లేరు!

మాధవధార, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని యూపీహెచ్‌సీల్లో వైద్యులు లేక సేవలు అందడం లేదు. కొద్ది నెలల క్రితం 49వ వార్డు బర్మాక్యాంప్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టరు నాయుడు ఉద్యోగం వదిలేసి వెళ్లిపోయారు. తాజాగా మాధవధార ఆర్అండ్‌బీ జంక్షన్‌లోని యూపీహెచ్‌సీ వైద్యుడు కె.వెంకటేష్ అదే బాట పట్టారు. ఈయనకు విజయనగరం జిల్లా ఆసుపత్రిలో ఉద్యోగం లభించడంతో ఇక్కడి కాంట్రాక్ట్ ఉద్యోగాన్ని వదులుకున్నారు. వైద్యులు లేకపోవడంతో ఆరోగ్య పరిరక్షణ చూసేనాథుడే లేరని స్థానికులు వాపోతున్నారు. కనీసం ఇంచార్జి వైద్యులను నియమించలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్యపరికరాలు, మందులు ఉన్నా, వైద్యులు లేకపోవడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులకే పరుగులు పెడుతున్నారు. ఖాళీలు భర్తీ చేసి వైద్య వసతులు కల్పించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

నేలకొరిగిన చెట్టు కొమ్మలు


అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట...

సీతమ్మధార, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గల రోడ్డులో చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. చెట్టు కిందనే మెడికల్ స్టోర్ ఉండటంతో అక్కడ ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసి ఉన్నాయి. వాటిపై చెట్టు కొమ్మలు పడ్డాయి. వాహనాలకు ఎటువంటి నష్టం వాటిల్లకపోవడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థులు వృత్తి నైపుణ్యాలు సాధించాలి


విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న అతిథులు

మురళీనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేటి పోటీ వాతావరణంలో సాంకేతిక విద్యలో మెరుగైన ఫలితాలతో పాటు ప్రత్యేక నైపుణ్యాల్ని సొంతం చేసుకోవాలని జాతీయ వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య వైస్ ప్రెసిడెంట్, వెయిట్ లిఫ్టింగ్ రిఫరీ కె.సూర్యనారాయణ సూచించారు. బుధవారం మురళీనగర్‌లోని విశాఖ ఐటీఐ సంస్థ 2023-25 బ్యాచ్ విద్యార్థుల పాస్ అవుట్ కార్యక్రమం నిర్వహించారు. సరికొత్త టెక్నాలజీ ఆవిష్కృతమవుతున్న ప్రస్తుత తరుణంలో యువత మార్పులను గమనిస్తూ భవిష్యత్తులో మెరుగ్గా స్థిరపడాలని సూర్యనారాయణ ఆకాంక్షించారు. 98 మంది విద్యార్థులకు ఐటీఐ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందించారు. ప్రిన్సిపల్ కె.సింహాద్రి, చైర్మన్ వెంకటేశ్వరులు, 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ హాజరయ్యారు.

'అనుమతులిచ్చిన రూట్‌లోనే జగన్ పర్యటన'


విలేకరులతో మాట్లాడుతున్న వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త కురసాల కన్నబాబు, పాల్గొన్న మాజీ మంత్రి అమర్‌నాథ్ తదితరులు

మద్దిలపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి ఉమ్మడి జిల్లా పర్యటన పోలీసులు అనుమతులు ఇచ్చిన రూట్‌లోనే కొనసాగించడానికి నిర్ణయించినట్టు ఆ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 9న ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఎన్ఏడీ, గోపాలపట్నం, పెందుర్తి మీదుగా మాకవరంలో నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు వెళ్తారని చెప్పారు. తర్వాత నేరుగా కేజీహెచ్‌కు చేరుకుని అక్కడ చికిత్స పొందుతున్న కురుపాం వసతి గృహం గిరిజన విద్యార్థులను పరామర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను పోలీసులకు తెలియజేస్తున్నామన్నారు. కురుపాం వసతి గృహంలో 150 మంది వరకు గిరిజన బాలికలకు పచ్చకామెర్లు సోకాయని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆస్పత్రి పాలయ్యారని కన్నబాబు విమర్శించారు. జగన్ పర్యటనకు ఆంక్షలు పెట్టడమే కాకుండా నాయకులను వేధిస్తున్నారని ఆరోపించారు.

సుందరీకరణ పనులు ప్రారంభం

సింహాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో వచ్చే నెలలో జరగనున్న ఐఎఫ్ఆర్ సదస్సు పురస్కరించుకుని బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్‌ను జీవీఎంసీ నిధులతో సుందరంగా తీర్చిదిద్దుతు న్నారు. ఇందుకు రూ. 10 కోట్ల కేటాయించారు. సదస్సుకు హాజరయ్యే దేశ, విదేశీ ప్రతినిధులు అప్పన్నస్వామిని దర్శించుకునే అవకాశం ఉండడంతో పాతగోశాల కూడలి నుంచి పాత అడివివరం కూడలి వరకు సుందరీకరణ పనులు చేపడుతున్నారు. బుధవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లకు టైల్స్ అద్దారు.ఈ పనులు పూర్తయిన తరువాత డివైడర్ల మధ్యలో మొక్కలు నాటడం,లైటింగ్ వంటి పనులు చేపట్టనున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ నరసింహం ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఎన్‌జీజీవోస్ కాలనీలో అన్న సమారాధన

అక్కయ్యపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలో దుర్గాదేవి ఉత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోతు సత్యనారాయణ హాజరై భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు.

'అంబుజా'పై నిరసన గళం

» పెదగంట్యాడలో సిమెంటు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయవద్దంటూ నినాదాలు

పెదగంట్యాడ/కూర్మన్నపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడలో అంబుజా సిమెంటు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయవద్దంటూ ప్రజలు నిరసన గళం వినిపించారు. పెదగంట్యాడ ఉక్కు నిర్వాసిత క్రీడా మైదానంలో బుధవారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా అడ్డుకున్నారు. ఇప్పటికే గంగవరం పోర్టు కాలుష్యం, డంపింగ్ యార్డు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ఇలాంటి తరుణంలో ఇక్కడ సిమెంటు ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.



నాయకులు ఇళ్లలో దాక్కుంటారా?

-శ్రీలత, పెదగంట్యాడ

అంబుజా సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు నిమిత్తం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకునేందుకు ప్రతి ఇంటి నుంచి చిన్నా, పెద్దా అన్న తారతమ్యం లేకుండా రోడ్డెక్కితే తమ ముందుండి ఆందోళనను నడిపించాల్సిన నాయకులు మాత్రం ఇళ్లలో దాక్కుంటారా? ఓట్లు అడగడానికి మాత్రం ఇంటింటికీ వస్తారా? మా ప్రాంతంలో సిమెంటు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయవద్దు. మాకు న్యాయం జరిగేలా నాయకులు కృషి చేయకపోతే భవిష్యత్తులో ఓట్లు వేయం.

సాఫ్ట్‌వేర్ కంపెనీలు పెట్టొచ్చు కదా..



-ఎ.అప్పారావు, బీహెచ్‌పీవీ రిటైర్డు ఉద్యోగి, పెదగంట్యాడ

జనసాంద్రత లేని ప్రాంతాల్లో సిమెంటు ఫ్యాక్టరీ పెట్టుకోండి. ఇప్పటికే కాలుష్యంతో అల్లాడుతున్న మా ప్రాంతంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టాలని చూడడం దారుణం. ఇప్పటికే గంగవరం పోర్టు, డంపింగ్ యార్డు వల్ల తాము శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడ సాఫ్ట్‌వేర్ కంపెనీలు పెట్టండి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించండి. అన్ని ఐటీ కంపెనీలను మధురవాడ, సాగర్‌నగర్ వైపే ఎందుకు పెట్టాలి. ఏదిఏమైనా ఇక్కడ సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటును తాము అడ్డుకుంటాం.

ఊళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలా?



-పి.హేమలత, గృహిణి, పెదగంట్యాడ

గంగవరం పోర్టు కాలుష్యం వల్ల ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఊళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితులను తీసుకువస్తున్నారు. మరోవైపు డంపింగ్ యార్డు దుర్వాసనతో సతమతమవుతున్నాం. కాలుష్య సమస్యలతో ఇప్పటికే అనారోగ్యాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. మాకు న్యాయం జరగకపోతే ఎమ్మెల్యే ఇంటి దగ్గర ఆందోళన చేస్తాం. మాకు న్యాయం చేసేందుకు అన్ని పార్టీల నాయకులు ఏకతాటిపైకి వచ్చి సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేసేందుకు పోరాడాలి.

అడ్డుకునేందుకు ఎంతవరకైనా వెళతాం



-కె.భారతి, అయ్యన్నపాలెం

తమ ప్రాంతంలో సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకునేందుకు ఎంతవరకైనా వెళతాం. విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం మా ఇళ్లు, భూములను త్యాగం చేశాం. అయినా ఇప్పటికీ 70 శాతం మంది నిర్వాసితులుగానే ఉన్నారు. ఆ భూములను స్టీల్ ప్లాంట్ కోసం.. మా భవిష్యత్తు కోసం మేమిస్తే.. వాటిని అదానీకి అనుబంధ సంస్థ అయిన అంబుజాకు ధారాదత్తం చేయాలనుకోవడం దారుణం. ఇక్కడ మేమంతా సిమెంటు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తుంటే తాము ఓట్లు వేసిన నాయకులు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు?

చురుగ్గా భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు

» ఏపీ ట్రాన్స్‌కో 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి ప్రారంభం



పారిశ్రామిక ప్రాంతంలో భూగర్భంలో విద్యుత్ కేబుళ్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మల్కాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్ల ఏర్పాటు పనులు పారిశ్రామిక ప్రాంతంలో చురుగ్గా సాగుతున్నాయి. తొలుత నేవల్ డాక్‌యార్డు కాకతీయ గేటుకు సమీపంలో ఉన్న ఏపీ ట్రాన్స్‌కో 132కేవీ సబ్ స్టేషన్ నుంచి ప్రారంభించారు. ఈ ప్రాంతంలో ఉన్న అన్ని సబ్ స్టేషన్‌లకు ఇక్కడ నుంచే విద్యుత్‌ను సరఫరా చేస్తుంటారు. అందువల్ల ఇక్కడ నుంచి మరో సబ్ స్టేషన్‌కు భూగర్భం నుంచి విద్యుత్ కేబుళ్లను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం గొడౌన్స్ ప్రాంతంలో రోడ్డును తవ్వి కేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవలే ఈ పనులకు సంబంధించి నియోజకవర్గంలో రెండుచోట్ల ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు భూమి పూజ కూడా చేశారు. కాకతీయ గేటు సమీపంలోని 132 కేవీ సబ్ స్టేషన్ పారిశ్రామిక ప్రాంతానికి ఎంతో ముఖ్యమైంది. ఆ తరువాత మల్కాపురంలో ఒక సబ్ స్టేషన్, జనతా కాలనీలో మినీ సబ్ స్టేషన్, కొత్త నక్కవానిపాలెంలో మరో సబ్ స్టేషన్ ఉంది. ఈ సబ్ స్టేషన్‌ల ద్వారానే ఆయా ప్రాంతాల్లోని ఇళ్లకు విద్యుత్ సరఫరా అవుతుంది. భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్ల ఏర్పాటు పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లోని నివాసాలకు భూగర్భం నుంచే విద్యుత్ సరఫరా అవుతుందని అధికారులు చెబుతున్నారు.



గోపాలపట్నం ప్రధాన రహదారిలో కురుస్తున్న వర్షం

కుండపోతగా వర్షం

» పొంగిపొర్లిన గెడ్డలు

గోపాలపట్నం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుండపోతగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం సుమారు గంటన్నర కురిసిన భారీ వర్షానికి కొండవాలు ప్రాంతాల నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. ముఖ్యంగా కొత్తపాలెం గ్రామ శివారులోని లోతట్టు ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాలు చెరువులను తలపిస్తున్నాయి. వర్షం కురిసినంతసేపు ప్రధాన రహదారిలోని బీఆర్‌టీఎస్‌పై పలు చోట్ల నీరు నిలిచిపోయింది. వర్షం కారణంగా కొత్తపాలెం, చంద్రనగర్, పాతగోపాలపట్నం ప్రాంతాల్లోని అండర్‌పాస్‌వేల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో రూ.30.1 లక్షల కార్పొరేషన్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులలో నాణ్యత పాటించాలని, నెల పాటు వాటరింగ్ చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రహదారి సమస్య పరిష్కరించినందుకు కాలనీ వాసులు కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ భద్ర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుంతలమయంగా బీఆర్‌టీఎస్ రోడ్డు

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీ ఫ్లైఓవర్ నుంచి బుచ్చిరాజుపాలానికి వెళ్లే బస్‌స్టాప్ ముందుగుంతలు ఏర్పడడంతో వాహ నదారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ముఖ్యంగా ఫ్లైఓవర్ దిగువున బస్‌స్టాప్ వరకూ దాదాపు నాలుగు గుంతలు ఏర్పడ్డాయి. వీటిలో ఉన్న పెద్ద గోతిని తాత్కాలికంగా రాళ్లు వేసి వదిలేశారు. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ఈ గుంతల్లో పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎన్ఏడీ ప్రధాన రహదారిలో గుంతలు

పార్టీలో మహిళలకు అధిక ప్రాముఖ్యం

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



మహిళా కమిటీ ప్రమాణ స్వీకారసమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో మహిళలను ఆర్థికంగా, రాజకీయంగా తగిన ప్రాముఖ్యం కల్పించిన పార్టీ తెలుగుదేశమేనని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన మహిళా కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆస్తిలో సమాన హక్కును కల్పించిన మహోన్నత వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ ఎన్‌టీ. రామారావు అని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ మహిళలకు తగిన గుర్తింపు కల్పించిందన్నారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. మహిళల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను సీఎం చంద్రబాబునాయుడు ప్రవేవపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గాజువాక నియోజకవర్గం అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవాని, ప్రధాన కార్యదర్శి కణితి సన్యాసమ్మ, నాయకులు పద్మ, సత్యవతి, మంగ భార్గవి, పుష్పలత, సంజీవి పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాల ఉపాధ్యాయుడికి సత్కారం



రాపర్తి ప్రసాద్‌కు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

పెందుర్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎంశ్రీ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాపర్తి ప్రసాద్ 'మాధ్యమిక విద్య భాషా బోధన జీవననైపుణ్యాలు' అనే అంశంపై పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలోని జీవీఆర్ ఇనిస్టిట్యూట్‌లో బుధవారం నిర్వహించిన జాతీయ సదస్సులో సెమినార్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు ఈ సెమినార్‌కు హాజరైయారు. అనంతరం జీవన నైపుణ్య నైతిక క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య ఇలా పలు అంశాలపై చర్చ జరిగింది. ఈ క్రమంలో భావవీణ పత్రికలో రాపర్తి ప్రసాద్ వ్యాసం ప్రచురిత మైంది. ఈ సందర్భంగా ఉపధ్యాయుడు రాపర్తి ప్రసాద్‌ను ముఖ్య అతిథి సహస్రావధాని కడిమెన వరప్రసాద్ శాలువా కప్పి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. జాతీయ స్థాయి సదస్సులో పురస్కారం సాధించిన ప్రసాద్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

నేడు పెందుర్తికి మాజీ సీఎం జగన్ రాక

» మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్



అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పెందుర్తి అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి గురువారం ఉదయం విశాఖ పర్యటనలో భాగంగా పెందుర్తి వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పర్యటన విమా నాశ్రయం నుంచి ఎన్ఏడీ కొత్తరోడ్డు, వేపగుంట మీదుగా ప్రయాణించి పెందుర్తి జంక్షన్‌కు చేరుకుని అక్కడి నుంచి ఎన్‌హెచ్16 మార్గంలో నర్సీపట్నం మెడికల్ కళాశాలకు చేరుకోనున్నారని తెలిపారు. జగన్ పర్యటనను నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు విజయవంతం చేయాలని అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు.

కమనీయం...అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలను సమర్పించారు. అనంతరం శాస్త్రీయ విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.



70వ వార్డులో పూజలందుకుంటున్న అమ్మవారు

పైడితల్లమ్మకు ప్రత్యేక పూజలు

ఆటోనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాస నగర్, ఎర్రగడ్డ కాలనీ, శ్రామిక నగర్ ప్రాంతాల ప్రజల ఇలవేల్పు శ్రీపైడితల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బండారు సత్యారావు, బొడ్డేడ రమణ, మోహన్‌కృష్ణ, ఆడారి రామకృష్ణ, కోటేశ్వరరావు, రమణ, కృష్ణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయానికి మైకు సెట్ వితరణ

అగనంపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి దానబోయినపాలెంలో గల నూకాంబికా ఆలయానికి స్థానిక నాయకుడు బలిరెడ్డి నాగేశ్వరరావు మైకు సెట్‌ను బుధవారం వితరణగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందజేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎల్‌వీ రమణ, గుదే సుశీల గజేంద్రరరావు, బిసత్యనారాయణ, సన్యాసిరావు, అప్పారావు, నారాయణ, అప్పలరాజు, పైడియ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎంయూ దీక్షలు



దీక్షలో కూర్చున్న నాయకులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో తరలింపు ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 41వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎన్ఎంయూ స్టీల్ సిటీ డిపో అధ్యక్షుడు జి.రామకృష్ణ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యంతో 33 ఏళ్ల స్టీల్ సిటీ డిపో లీజు ముగిసినందున ఇటీవల ఆర్టీసీ యాజమాన్యానికి ఉక్కు యాజమాన్యం నోటీసులు జారీ చేసిందన్నారు. ప్రస్తుత భూమి విలువ ఆధారంగా లీజు చెల్లించాలని, వడ్డీ లేని సెక్యూరిటీ డిపాజిట్‌గా, సేవా చార్జీలుగా కోట్లాది రూపాయలు చెల్లించాలని కోరడం సమం జసం కాదన్నారు. గతంలో నిర్దేశించిన లీజును పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యవతి, రమణ, వీఏ రావు, ఎస్‌వీ రాజు, డీఎస్ వాసు, కేఎస్ రావు, ఆర్కే రాజు, బీఎస్ఎన్ఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 20, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 44, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270



ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం ఇస్లాంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ జె.వివేకానందరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతి అంశంపై విద్యార్థులు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల మహిళలకు..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక కమ్యూనిటీ హాల్ వద్ద బుధవారం డ్వాక్రా సంఘాల మహిళలకు జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ జిల్లా కార్యదర్శి గంతకోరు అప్పారావు పాల్గొని మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపు వలన పేదలకు ఎంత మేలు చేకూరుతుందన్నారు. పేద వార్గాలకు అన్ని విధాల ఆదుకోవాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిదన్నారు. ఇకపై నిత్యావసర సరులకు ధరలు తగ్గుతాయన్నారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రతి ఒక్కరు అవగాహన చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు అమరపిన్ని గోవింద్, డ్వాక్రా సీసీ మామిడి కొండమ్మ, ఆర్పీ శ్రీదేవి, అలమండ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్




ట్రోఫీని చూపుతున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో యువత రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి కణితి కాలనీలో బుధవారం క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి, క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆహ్లాదం, ఆరోగ్యం, ఉపాధి లభిస్తుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి నడవడికను అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, డీవీ అప్పారావు, పి.దానయ్య, ఎం.రాము, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

భూములు అప్పగించేలా చూడాలని వినతి

అగనంపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కౌలుకు ఇచ్చిన తమ భూమిని అప్పగించేలా చూడాలని కోరుతూ గాజువాక డిప్యూటీ తహశీల్దార్‌కు డొంకాడ కాలనీకి చెందిన బొబ్బరి చిన్నమ్మలు అనే మహిళ బుధవారం వినతిపత్రం అందజేసింది. అగనంపూడి రెవెన్యూ నంబరు 193/9లో తమ అత్తమామల నుంచి సంక్రమించిన 40 సెంట్ల వ్యవసాయ భూమి ఉందన్నారు. భర్త అప్పలనాయుడు మరణించడంతో వ్యయసాయం చేయలేక గత కొన్నేళ్లుగా ఇ-మర్రిపాలేనికి చెందిన ఓ వ్యక్తికి కౌలుకి ఇచ్చామన్నారు. సదురు వ్యక్తి గతంలో ఏటా కౌలు కింద నగదు ఇచ్చేవాడని, ప్రస్తుతం ఇవ్వకపోవడంతో తమ భూములు అప్పగించాలని కోరితే దురుసుగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయారు. అందువల్ల సదరు వ్యక్తి నుంచి తమ భూములను అప్పగించేలా చూడాలని డీటీకి విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 42 అడుగుల ఏకశిల ధ్వజస్తంభం

కూర్మన్నపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంత 87వ వార్డు పరిధి కణితి కాళింగుల వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీకార్తికేయ, శ్రీస్వర్ణాకర్షణ భైరవ, శ్రీభువనేశ్వరిదేవి సహిత శ్రీపంచముఖేశ్వరస్వామి సాంగ దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్తరాంధ్రలో ఎక్కడా లేని విధంగా 42 అడుగుల ఏకశిల ధ్వజస్తంభాన్ని ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. గురువారం విగ్రహాల తిరువీధి, నవగ్రహ రుద్ర మండల అర్చనలు, పదో తేదీన సూర్య నమస్కారాలు, సామూహిక కుంకుమ పూజలు, 11న విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధనను చేపడతామని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనవలసిందిగా కోరారు.

దళిత సంఘాల నిరసన



కూర్మన్నపాలెం కూడలిలో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల సభ్యులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేశ్ కిశోర్ దాడికి యత్నించడాన్ని ఖండిస్తూ బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు కేబీఆర్ అంబేడ్కర్, మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ దాడికి యత్నించిన రాకేశ్ కిశోర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బూసి వెంకటరావు, పెంటయ్య, చింతయ్య, దాస్, సంపూర్ణం, బీఏ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీచ్‌రోడ్డులో 'సఖి సురక్ష'

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళల ఆరోగ్యం, సామాజిక ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరిచేందుకు మెప్మా ఆధ్వర్యంలో సఖి సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్, సాగరిక మీటింగ్ హాల్లో గురువారం ఉదయం 10 గంటలకు మెప్మా డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ప్రారంభిస్తారని జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి తెలిపారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు 16 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. 35 ఏళ్లు దాటిన సంఘం సభ్యులకు పరీక్షలు నిర్వహించేలా మెప్మా, జాతీయ పట్టణ ఆరోగ్య సంస్థ ప్రణాళికలు సిద్ధం చేశాయన్నారు.

నూతన భవన నిర్మాణాలెన్నడో ?

కేజీహెచ్‌లో శిథిలావస్థకు చేరిన బిల్డింగ్స్


- అవస్థల మధ్య సేవలందిస్తున్న సిబ్బంది
- గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరిట హడావుడి
- ఆర్థో, కార్డియాలజీ, గైనిక్ విభాగాలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ప్రకటన
- రెండేళ్లలో ఒక్కరూపాయి విదల్చని వైసీపీ సర్కారు

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): **ఉత్తరాంధ్రుల ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌లోని అనేక విభాగాలకు చెందిన భవనాలు శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. అప్పటి నిర్మాణ పద్ధతులను అనుసరించి రాతితో నిర్మించిన భవనాల్లో అనేకం ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలిచి ఉండగా, ఆ తరువాత నిర్మించిన భవనాలు మాత్రం శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని విభాగాల్లో వర్షం నీరు లీకవడం, కొన్నిచోట్ల పెచ్చులూడి, గోడలకు పగుళ్లు రావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయంతో ఆయా విభాగాల సిబ్బంది, రోగులు ఆందోళన చెందుతున్నారు.**

కేజీహెచ్‌లో భవనాలు శిథిలమవుతున్న విషయాన్ని ఆస్పత్రి అధికారులు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొన్ని


శిథిలావస్థకు చేరిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కార్డియాలజీ భవనం

భవనాలను కూల్చి వాటిస్థానంలో నూతన భవన నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించింది. నాడు-నేడు పథకంలో భాగంగా రూ.600 కోట్లతో ఆస్పత్రిలోని ప్రసూతి, ఆర్థోపెడిక్స్, కార్డియాల జీ, సర్జికల్ అంకాలజీ, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంతోపాటు ఎస్‌పీఎం, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, అనాటమీ, ఫిజియాలజీ విభాగాలకు నూతన భవనాలు నిర్మించాలని 2022లో ప్రతిపాదించింది. అంతేకాదు తక్షణమే నిధులు మంజూరు చేస్తామని కూడా ప్రకటించింది. ఆ తరువాత రెండున్నరేళ్లపాటు వైసీపీ అధికారంలో ఉన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. అసలు కేజీహెచ్‌లో నూతన భవన నిర్మాణాలపై జిల్లాలోని అప్పటి ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోలేదు. నాడు నేడు పేరిట హడావుడి తప్ప, రెండేళ్లు కాలయాపన చేసి, ప్రతిపాదనలను పూర్తిగా పక్కనపెట్టేయడంతో అవస్థల మధ్య వైద్య సేవలు అందించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలంలో లీకులు ఎక్కువవడం, పెచ్చులూడి పడుతుండడంతో భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా నూతన భవన నిర్మాణాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.


అధ్వాన స్థితికి చేరిన గైనకాలజీ డిపార్ట్‌మెంట్ భవనాలు

దశల వారీగా చేపడితే మేలు

ఆస్పత్రిలోని అనేక విభాగాలకు చెందిన భవనాలు పాతవి కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటి స్థానంలో దశలవారీగా నూతన నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఒకేసారి అన్నింటినీ కూల్చి నూతన భవనాలను నిర్మించడం సాధ్యం కాదు. దీనివల్ల వేలాది మంది రోగులకు ఇబ్బందులు ఎదురవుతాయి. కాగా కొన్ని విభాగాలు నిర్వహిస్తున్న భవనాలు చిన్నవిగా ఉండడంతో యూనిట్లు పెంచుకునేందుకు, బెడ్ల సంఖ్యను రెట్టింపు చేసుకునేందుకు అవకాశం లేదు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న బెడ్లు, యూనిట్లతోనే నిర్వహించాల్సి వస్తోంది. ఇది రోగులకు అందే వైద్య సేవలపై ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో నూతన భవనాలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా, ఆధునిక వసతులతో నిర్మిస్తే రోగులకు అందించే వైద్య సేవల్లో నాణ్యత పెరగడంతోపాటు మరింతమందికి చికిత్స చేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. భవనాల అవసరాన్ని ఇప్పటికే ఆస్పత్రి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

అప్పన్న సన్నిధిలో దేవదాయశాఖ కమిషనర్


ప్రసాదం అందజేస్తున్న ఏఈఓ

సింహాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):వరాహలక్ష్మీనృసింహస్వామిని దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కోడూరి అచ్యుత రామచంద్రమోహన్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న కమిషనర్ గోత్రనామాలతో అంతరాలయంలో ప్రధానార్చకులు కరి సీతారామాచార్యులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు ప్రసాదాలను అందజేశారు.

పూర్తిచేయని మెడికల్ కళాశాలకు ఎలా వెళతారు

- టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలో నిర్మాణాలు నిలిపివేసిన మెడికల్ కళాశాల సందర్శనకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రావడంపై తెలుగుదేశం విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ అభ్యంతరం వ్యక్తంచేశారు. తన హయాంలో మెడికల్ కళాశాలను పూర్తిచేయలేకయారని, అటువంటి చోటకు వచ్చి ఏమి చేస్తారన్నారు. అసంపూర్తిగా ఉన్న రెండు, పునాదుల్లో ఉన్న మరో భవనం చూసి వెళతారా అన్నారు. మెడికల్ కళాశాలపై చిత్తశుద్ధి ఉంటే 2023 డిసెంబరులోనే నిర్మాణాలు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. జగన్ పర్యటనను తామేమి అడ్డుకోవడంలేదని, అటువంటి విధానం టీడీపీకి లేదన్నారు. జగన్ పర్యటన తీరు, ఆయన వ్యవహారశైలిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలు ఇస్తే తప్పేంటని ప్రశ్నించారు. పీపీపీ అంటే ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో కళాశాలను నిర్వహిస్తారని ప్రైవేటు వ్యక్తుల అధీనంలోకి వెళ్లదన్నారు. దేశంలో చాలా ప్రాజెక్టులు పీపీపీ విధానంలో విజయవంతంగా నడుస్తున్నాయన్నారు.

అంబుజాకు అనుకూలంగా లేఖలు

- అదానీ యాజమాన్యం లోపాయికారీ ఏర్పాట్లు

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుచేయాలని కోరుతూ పలువురితో అదానీ యాజమాన్యం అధికారులకు లేఖలు రాయించింది. ఇందుకోసం వారికి నజరానా ఇచ్చింది. గంగవరం పోర్టుమార్గంలో రోడ్డు పక్కన దుకాణాలు పెట్టుకొని జీవించే వారికి ఇటీవల రూ.5 వేల నుంచి రూ.10వేలు ఆర్థిక సాయం చేసింది. సామాజిక బాధ్యత కింద అందజేసి స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంది. దీనిపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ స్పందిస్తూ తప్పుడు లేఖలను అధికారులు పరిగణనలోకి తీసుకోకూడదన్నారు. వేదికలో అభిప్రాయాలనే ప్రామాణికంగా తీసుకోవాలన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయులుగా నిలవాలి

- కలెక్టర్ హరేంధిరప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, శిక్షణ శిబిరంలో పాల్గొన్న నూతన ఉపాధ్యాయులు

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి ఆదర్శ ఉపాధ్యాయులుగా నిలవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. రుషికొండ ఐటీ హిల్స్ శ్రీకళాస్‌విద్యాసంస్థలో నూతన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని బుధవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలకాలం విద్యార్థులు గుర్తుపెట్టుకునేలా వినూత్నరీతిలో పాఠాలు బోధించాలని, క్రమశిక్షణ అలవడేలా తీర్చిదిద్దాలన్నారు. వృత్తిని ప్రేమిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. ఎంతో కష్టపడి సర్కారు కొలువు సాధించడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో ఉత్తమ సేవలందించాలన్నారు. శిక్షణలోని ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా ఆకళింపు చేసుకోవాలన్నారు. ఆధునిక బోధనా పద్ధతులను తెలుసుకుని వాటిని ఆచరణలో పెట్టాలన్నారు. సిలబస్ టైమ్‌టేబుల్ ప్రకారం తరగతుల నిర్వహణతో పాటు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలన్నారు. స్నేహపూర్వక బోధన సాగాలని, విద్యార్థులను, వృత్తిని ప్రేమించాలన్నారు. ప్రతిరోజూ పాఠశాలకు రావాలనే కుతూహలాన్ని విద్యార్థుల్లో కలిగించాలన్నారు. భవిష్యతులో విద్యార్థులు ఉపాధ్యాయులను గుర్తుంచుకునేలా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ చంద్రశేఖర్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

జగన్ గో బ్యాక్ అంటూ నిరుద్యోగుల నిరసన



నిరసన నినాదాలు చేస్తున్న నిరుద్యోగులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిని, గూగుల్ డేటా సెంటర్‌ను వ్యతిరేకిస్తున్న మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి గో బ్యాక్ అంటూ ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ అన్నారు. పోర్టు స్టేడియం సమీపంలో బుధవారం నిరుద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హేమంతకుమార్ మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్ వస్తే భావితరాలకు, యువతకు ఉద్యోగ, ఉపాధి లభిస్తుందన్నారు. ఇప్పటికే లక్షలాది మంది యువత కుటుంబాన్ని వదిలి వలసలు పోయి ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో పని చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌ను హైటెక్ సిటీ చేసినట్లే, విశాఖను కూడా సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభివృద్ధి చేస్తారని నమ్ముతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సనపల తిరుపతిరావు, లక్ష్మి, రేవతి, రూప, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు తొలగింపు

- కబ్జా వెనుక కూటమి నేతలు?


గతనెల 18న ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు


బోర్డును తొలగించిన కబ్జా దారులు

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం భీమన్నదొరపాలెంలో ఎల్‌పీ నంబరు 1509(పాత సర్వేనంబరు 156)లో ప్రభుత్వానికి చెందిన కొండ వాలులో రెవెన్యూ అధికారులు పాతిన హెచ్చరిక బోర్డును కబ్జాదారులు పీకేశారు. ఈ చర్య వెనుక కూటమినేతలు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలోని కొండవాలులో సుమారు 10 ఎకరాల స్థలంలో పొదలు, చెట్లు తొలగించి చదునుచేసి, ఆక్రమణలకు పాల్పడడంపై 'కొండవాలుపై కన్ను' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఆనందపురం తహశీల్దారు తక్షణమే ఆక్రమణలను అడ్డుకుని, హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో సర్వేయర్, వీఆర్వో చదునుచేసిన ప్రాంతం పరిశీలించి గత నెల 18న హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. సుమారు 175 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండవాలుపై కొందరు కూటమినేతలు కన్నేసి దశలవారీగా ఆక్రమించాలని ప్లాన్ వేశారు. ఈ నేపథ్యంలో కిందిస్థాయి రెవెన్యూ సిబ్బందిని బెదిరించి కొండవాలులో పాతిన హెచ్చరిక బోర్డు తొలగించారు. ఇక్కడ చదునుచేసిన భూమి విలువ సుమారు రూ. 50 కోట్లు ఉంటుంది. సమీపంలో తోటలు కూటమి నేతలకు చెందినవిగా చెబుతున్నారు. వీరే బోర్డు పీకేశారని, రెవెన్యూ సిబ్బందిని బెదిరించారని చెబుతున్నారు. కబ్జా దారులకు ప్రభుత్వంలో పలుకుబడి ఉండడంతో రెవెన్యూ సిబ్బంది భయంతో వెనక్కి తగ్గారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వన్య ప్రాణుల సంరక్షణ సమష్టి బాధ్యత

- ఏపీ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ బీఎం దివాన్ మైథిన్
- జూలో ముగిసిన వన్య ప్రాణుల సప్తాహం
- వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం


వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులతో అటవీశాఖ అధికారులు

ఆరిలోవ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులు కూడా మన లాంటి జీవులేనని, అవి మన కుటుంబంలో భాగమేనని భావించి, వాటి మనుగడకు ముప్పు వాటిల్లకుండా చూసుకోవాలని ఏపీ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ బీఎం దివాన్ మైథిన్ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలోని బయోస్కోప్ సెంటర్‌లో బుధవారం వన్య ప్రాణి సప్తాహ వేడుకల ముగింపు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల మనుగడకు ముప్పు కలగకుండా చూసే బాధ్యత అందరిపై ఉందన్నారు. వన్య ప్రాణుల పరిరక్షణ అవసరం,కర్తవ్యంగా భావించాలన్నారు. అటవీ శాఖ రీజనల్ హెడ్ బి.బాలాజీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వన్యప్రాణులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జూ పార్కు క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ ఈ నె 2 నుంచి 8 వరకు నిర్వహించిన ఈ వన్య ప్రాణుల సప్తాహ వేడుకలకు విశాఖ నగరం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల చిన్నారులు కూడా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో ప్రథమ బహుమతిని కనీషా దుర్గా గెల్చుకుంది. ఈ కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, జూ సిబ్బంది పాల్గొన్నారు.

తూతూమంత్రంగా కార్యక్రమం

ఈసారి జూలో నిర్వహించిన వన్య ప్రాణుల సప్తాహం కార్యక్రమానికి అంతగా స్పందన కనిపించలేదు. గతంలో వివిధ జంతువులను చూపించి వాటి గురించి విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించేవారు. పాములు, గద్దలు రాబందులపై అవగాహన కల్పించే కార్యకమాలు చేపట్టేవారు. ఈసారి అలాంటి కార్యక్రమాలేవీ చేపట్టలేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఉత్సాహం చూపలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జూ అధికారులు తూతూ మంత్రంగా వన్యప్రాణి సప్తాహం నిర్వహించినట్టు ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు విమర్శించారు.

క్రైం... crime news

విద్యార్థిని ఆత్మహత్య

సాగర్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రుషికొండలోని స్వర్ణభారతినగర్‌లో విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పీఎం పాలెం ఎస్‌ఐ కాళ్ల భాస్కర్ తెలిపిన వివరాలు ప్రకారం.. కొమర భవానీ (21) చదువు నిమిత్తం మావయ్య ఇంట్లో ఉంటోంది. అతనికి దుకాణం ఉంది. భవానీ అప్పుడప్పుడు షాపులో వుండి మావయ్యకు సహాయం చేసేది. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు రాయడానికి తిరుపతి బయలుదేరిన యువతి ఆచూకీ లేకుండా పోయిందని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రామ్‌శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హెచ్‌బీ కాలనీ ఉమా నగర్‌కు చెందిన రేగాన భవాని (22) సెప్టెంబరు 25న పోటీ పరీక్షలు రాయడానికి తిరుపతి బయలుదేరింది. ఆ తర్వాత నుంచి ఆమె ఫోన్‌లో అందుబాటులో లేకపోవడంతో, వివిధ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఆరా తీశారు. ఓ యువకుడిపై అనుమానంతో అతడి ఫోన్‌కు ప్రయత్నించగా, స్విచ్ ఆఫ్ వచ్చింది. అతడి తల్లిదండ్రులను కలిసినా సరైన సమాచారం ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు సీఐ కేఎస్ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో అదృశ్యం కేసు నమోదు చేశారు.

వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుడి అదృశ్యం


దానయ్య (ఫైల్)

సాగర్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళ్లిన ఓ వృద్ధుడు తిరిగిరాలేదని అతని భార్య బుధవారం పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నరుషికొండకు చెందిన గద్దిపల్లిదానయ్య (70) ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్తుంటాడు. గత సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు వాకింగ్‌కు అని వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. పోలీసులుసీసీ టీవీ ఫుటేజీ పరిశీలించగా చివరిగా చిన్నరుషికొండ వైన్‌షాప్ వద్ద సంచరించినట్టు తేలింది. కేసు నమోదుచేసి, ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

కొయ్యపేటలో అతిసార

- 17 మందికి అస్వస్థత
- ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు
- గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో

పద్మనాభం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ పరిధి కొయ్యపేటలో 17 మంది అతిసార వ్యాధితో అస్వస్థతకు గురయ్యారు. నాలుగు రోజులుగా నీళ్ల విరేచనాలతో బాధపడుతున్నారు. వీరిలో కె.ఆదినారాయణ విజయనగరం మహరాజ ఆస్పత్రిలో చికిత్స పొందారు. రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లీలాప్రసాద్ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జె.సత్యవతి, ఎన్.లక్ష్మి, నారాయణప్పడు తదితరులు శిబిరంలో చికిత్స పొందుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు గ్రామాన్ని సందర్శించారు. పది రోజులపాటు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఎందుకు నిర్లక్ష్యం వహించారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటి సర్వే చేసి రోగులను గుర్తించాలని ఆదేశించారు. తాగునీటిని పరీక్షలకు పంపారు. విరేచనాల శాంపిళ్లను కేజీహెచ్‌లోని మైక్రో బయాలజీ లేబరోటరీకి పంపించారు. గ్రామంలోని పరిస్థితిని ఎంపీడీఓ రూపేష్ పరిశీలించారు. పారిశుధ్యం మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బందిని ఆదేశించారు.

అప్పన్న ఆభరణాల లెక్కలు చెప్పండి

- స.హ.చట్టం ప్రకారం దరఖాస్తు చేసిన న్యాయవాది

సింహాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులకు కానుకల రూపంలో సమర్పించిన రజిత, స్వర్ణ ఆభరణాల్లో వ్యత్యాసాలున్నటు వస్తున్న ఆరోపణలపై సమగ్ర వివరాలు తెలపాలని కోరుతూ అనకాపల్లికి చెందిన స.హ.చట్టం కార్యకర్త, న్యాయవాది కాండ్రేగుల వెంకటరమణ దేవదాయశాఖ కమిషనర్‌కు ఈనెల 7న దరఖాస్తు చేశారు. ఈ అంశంపై 2014 నుంచి నియమించిన కమిటీల వివరాలు, విచారణ నివేదికలను, ఆభరణాల తాజా రిజిస్టర్‌ను వెల్లడించాలన్నారు. ఆభరణాలు భద్రపరిచే విధివిధానాలను, కడప వాసి ప్రభాకరాచారి చేసిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలు, నివేదికలు ఇవ్వాలని కోరారు. దేవస్థానం లెక్కలపై ఆడిట్ అభ్యంతరాలు, అధికారుల సమాధానాలు 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాల కాపీలను ఇవ్వాలని కోరారు.

కన్జ్యూమర్ రైట్స్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా శ్రీరాములు


నియామకపత్రం అందిస్తున్న పాండే

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల కౌన్సిల్ జాతీయ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా విశాఖకు చెందిన సుప్రీం కోర్టు న్యాయవాది డాక్టర్ ఆర్.శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్‌పాండే బుధవారం నియామక పత్రాన్ని అందించారు. శ్రీరాములు న్యాయ నిపుణత, మార్గదర్శకత్వం ద్వారా దేశవ్యాప్తంగా వినియోగదారులకు న్యాయం అందించడంలో కౌన్సిల్ శక్తివంతంగా పని చేస్తుందన్న నమ్మకాన్ని పాండే వ్యక్తం చేశారు. కౌన్సిల్ పట్ల సంపూర్ణ నిష్ఠ, అంకితభావంతో సేవలు అందిస్తానని శ్రీరాములు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఏయూ బంద్ విజయవంతం



ఏయూలో బంద్ చేస్తున్న విద్యార్థి సంఘ నేతలు

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసే యత్నాన్ని నిరసిస్తూ చేపట్టిన ఏయూ బంద్ విజయవంతమైంది. అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌లో నాయకులు, ఉద్యోగులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్ట్స్, సైన్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్లి విద్యార్థులను బయటకు రప్పించారు. విద్యార్థి సంఘ నాయకులు సిర్ల శ్యామ్‌సుందర్, బోరుగడ్డ మోహన్‌బాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి యత్నం దారుణమన్నారు. కార్యక్రమంలో సుధీర్, విక్రమ్, శిరీష్, సురేంద్ర, రాజ్‌కుమార్, వసంత కృష్ణప్రసాద్, ముసుగు ప్రసాద్, డేవిడ్, టీవీ రాఘవులు పాల్గొన్నారు.

బాలికల ఐటీఐలో జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఐటీఐ ప్రాంగణంలో గల నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 10వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉప ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి శ్యామ్‌సుందర్ నిట్టల వివరాలను వెల్లడించారు. మేళాలో ఇన్నోవా, ఎస్ఆర్ అకడమిక్ ఆర్గనైజేషన్ తదితర సంస్థలు రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, టెలీకాలర్స్, రిసెప్షనిస్ట్ తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో వివరాలు, అర్హతలను నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి, గల అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో నేరుగా హాజరుకావాలన్నారు.